# అచ్చంపేటలో కుటుంబం అదృశ్యం - కేసు నమోదు



* నాలుగు రోజులుగా ఆచూకీ లేని భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలు

అచ్చంపేట,
సెప్టెంబర్ 07 (వుదయంప్రతినిధి )

పట్టణంలోని సాయినగర్ కాలనీకి చెందిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు మూడు రోజులుగా కనిపించకుండా పోయిన ఘటన కలకలం రేపుతోంది. అచ్చంపేట ఎస్ ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం, నియోజకవర్గం లోని ఉప్పునుంతల మండలం తాడూరు గ్రామానికి చెందిన పేట్ల ప్రభాకర్ (28), అతని భార్య తేజ (23), కూతురు ప్రీతిక (5), కుమారుడు విగ్నేశ్వర్ (3) ఐదేళ్ల క్రితం అచ్చంపేటకు వచ్చి ఆటోమొబైల్ షాప్ నడుపుకుంటూ జీవిస్తున్నారు. అదృష్య మైన కారణం తెలియదు కానీ గత మూడు రోజులుగా వారు ఇంటి వద్ద కనిపించకపోవడం, ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ప్రభాకర్ బాబాయి సూరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అచ్చంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి. నరేష్ తెలిపారు.

ఫోటో రైటప్ : నాలుగు రోజులుగా కనిపించకుండా పోయిన పేట్ల ప్రభాకర్ కుటుంబం

# ట్రాక్టర్ బోల్తా.. రైతు మృతి



నాగర్ కర్నూల్ రూరల్,
సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి):

వ్యవసాయమే జీవనాధారంగా కుటుంబాన్ని పోషిస్తున్న రైతు పొలం దున్నుతుండగా ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందిన విషాద ఘటన నాగర్ కర్నూల్ మండలం మల్కాపూర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎడ్ల బాలస్వామి (44) తన పొలంలో ట్రాక్టర్ తో కరిగేట దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బాలస్వామి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు.బాలస్వామి మృతితో ఆయన భార్య, ఇద్దరు కుమారులు దిక్కు తోచని స్థితిలోకి వెళ్లారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉంటూ వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న బాలస్వామి ఇక లేడనే నిజాన్ని కుటుంబసభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. భర్తను కోల్పోయిన భార్య, తండ్రిని కోల్పోయిన కుమారుల రోదన గ్రామస్తులను కలచివేసింది.

బాలస్వామి ఆకస్మిక మరణంతో కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో పడిందని, ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని, పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# గ్యాస్ వినియోగదారులకు ఊరట..

* 25 రోజులకే రీఫిల్ బుకింగ్‌కు అవకాశం

అయిజ
సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి)

గ్రామీణ ప్రాంతాల గ్యాస్ వినియోగదారులకు హెచ్‌పీ గ్యాస్ కంపెనీ ఊరట నిచ్చింది. ఇప్పటివరకు రీఫిల్ సిలిండర్ బుకింగ్‌కు ఉన్న 45 రోజుల పరిమితిని 25 రోజులకు పునరుద్ధరించినట్లు అయిజ శ్రీ లక్ష్మీ శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు డాక్టర్ రామ్ కుమార్ తెలిపారు. 45 రోజుల పరిమితి కారణంగా గ్రామీణ ప్రాంతాల వినియోగదారులు నిరంతరం ఇబ్బందులు ఎదుర్కొంటూ, ఫిర్యాదులు చేస్తున్నారని, దీంతో వినియోగదారులతో పాటు గ్యాస్ పంపిణీదారులపై కూడా ఒత్తిడి పెరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హెచ్‌పీ గ్యాస్ కంపెనీ రీఫిల్ బుకింగ్ వ్యవధిని 25 రోజులకు పునరుద్ధరించడం ద్వారా వినియోగదారులకు ఉపశమనం కల్పించిందన్నారు.ఇకపై గతంలో మాదిరిగానే 25 రోజులు పూర్తయిన తర్వాత రీఫిల్ సిలిండర్‌ను బుక్ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అయిజ శ్రీ లక్ష్మీ శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీ పరిధిలోని వినియోగదారులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రామ్ కుమార్ కోరారు.

# గద్వాల మార్కెట్‌కు రేపు సెలవు



గద్వాల సెప్టెంబర్ 07
(వుదయం కరస్పాండెంట్)

వ్యవసాయ మార్కెట్ కమిటీ గద్వాలలో పనిచేస్తున్న దడవాయిలు తమ సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సెప్టెంబర్ 8న నిర్వహించనున్న రాష్ట్ర సదస్సుకు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 8న గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించినట్లు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు టీ. తిరుపతి తెలిపారు. సెలవు రోజున రైతులు తమ పంట ఉత్పత్తులను వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకు రావద్దని ఆయన సూచించారు. రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఆర్టీసీ డిపోకు తోపాజి వినతి



సంగారెడ్డి వుదయం.

సంగారెడ్డి ఆర్టీసీ డిపో అభివృద్ధి మరియు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ TJMU యూనియన్ గౌరవ అధ్యక్షులు తోపాజి అనంతకిషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో డిపో మేనేజర్, డిప్యూటీ రీజనల్ మేనేజర్ లను కలిసి వినతిపత్రం అందచేసిన తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ప్రెసిడెంట్ మహేందర్, కార్యదర్శి విక్రమ్, రీజనల్ మహిళా కార్యదర్శి స్వరూప, డిపో మహిళా అధ్యక్షులు సక్కుబాయి, సభ్యులు సరిత, అమరమ్మ, సాయన్న, రాములు ప్రభాకర్, అనీల్, రవి, సురేష్ తదితరులు..ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు తోపాజి అనంతకిషన్ మాట్లాడుతూ సంగారెడ్డి డిపోను కార్మికుల పేరుతో బద్నామ్ చేసే విధంగా అధికారులు ప్రవర్తిస్తే ఊరుకోమని అన్నారు. సంగారెడ్డి డిపో లాభాల బాట పడే విధంగా జగ్గారెడ్డి సహకారంతో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో మాట్లాడి డిపో అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. వెంటనే కార్మికుల, మహిళా కార్మికుల సమస్యలు అన్ని పరిష్కరించి, పాత రూట్లలోనే అన్ని బస్సు సర్వీసులు పునరుద్దరించాలని పేర్కొన్నారు..

# వెంకటాపురంలో కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటన

* ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి, భూ రీ-సర్వేను 10 రోజుల్లో పూర్తి చేయాలి: కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్

నాగర్ కర్నూల్ రూరల్,
సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి):



నాగర్ కర్నూల్ మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో సోమవారం జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ క్షేత్రస్థాయిలో పర్యటించి పలు అభివృద్ధి పనులను, భూ రీసర్వే ప్రక్రియను పరిశీలించారు.ఇందిరమ్మ ఇళ్లు, పంచాయతీ భవనాల పరిశీలన:గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు, గ్రామపంచాయతీ భవనం, విలేజ్ ఆర్గనైజేషన్ (వీఓ) భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో మొత్తం 12 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 8 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని, 2 ఇళ్ల పనులుఇంకా ప్రారంభం కాలేదని అధికారులు వివరించారు.

పనులు ప్రారంభించని లబ్ధిదారులను పిలిపించి మాట్లాడిన కలెక్టర్, ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే పనులు ప్రారంభించాలని, లేకపోతే మంజూరు రద్దు చేస్తామని హెచ్చరించారు. దీంతో లబ్ధిదారులు 23 రోజుల్లో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ఆర్థిక సహాయం సకాలంలో అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామపంచాయతీ, వీఓ భవనాలను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు.భూ రీసర్వే, ఎస్ఐఆర్ పరిశీలన:అనంతరం గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. వెంకటాపురంలో 95 సర్వే నంబర్ల పరిధిలో 661 ఎకరాల 4 గుంటల భూమి, గ్రామ సరిహద్దులు 670 ఎకరాల 15 గుంటలు, గ్రామకంఠం 14 ఎకరాల 14 గుంటలు, పాత గ్రామకంఠం 4 ఎకరాల 24 గుంటలు ఉన్నట్లు అధికారులు వివరించారు. ప్రస్తుతం రోడ్ల సర్వే కొనసాగుతోందని, ఆ తర్వాత ప్రభుత్వ భూములు, పట్టా భూముల సర్వే చేస్తామని తెలిపారు. రీసర్వేను అత్యంత ఖచ్చితత్వం, పారదర్శకతతో, ఎలాంటి లోపాలకు తావు లేకుండా 10 రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా బూత్ స్థాయి అధికారుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించి, ఓటర్ల జాబితా రూపకల్పనను సజావుగా, సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు.కలెక్టర్ వెంట తహసీల్దార్ తబితా రాణి, ఎంపీడీవో చెన్నమ్మ, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ గిరిధర్, గ్రామ సర్పంచ్ నరసింహ రెడ్డి, సర్వేయర్లు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

# మండల స్థాయి సమీక్షా సమావేశం

నాగర్‌కర్నూల్ రూరల్ ,
సెప్టెంబర్ 07, (వుదయం ప్రతినిధి):



మండలంలోని వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, పురోగతిపై మండల స్థాయి సమీక్షా సమావేశం ఈ నెల 11న నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి చెన్నమ్మ సోమవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నాగర్‌కర్నూల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. మండల పరిధిలో అమలవుతున్న వివిధ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల పురోగతి, వాటి అమలులో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై సమావేశంలో సమీక్షించనున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమావేశానికి హాజరై తమ శాఖల ప్రగతి వివరాలను సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.

# గ్యారంటీలు పాయె.. జనం కొంపలు ముంచె!

సెప్టెంబర్ 07 (వుదయం బ్యూరో)



ఎన్నికల వేళ గద్దెనెక్కడమే పరమావధిగా కాంగ్రెస్ గుప్పించిన 6 గ్యారంటీలు, 420 హామీలు నేడు పచ్చి అబద్ధాలుగా, నగ్న సత్యాలుగా తేలిపోయాయని బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహ జ్వాలలు వ్యక్తం చేశాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నయవంచన, దగాకోరు వైఖరికి నిరసనగా జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల కేంద్రం సోమవారం రణరంగంగా మారింది. గద్వాల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి 'ని గులాబీ దళం ముట్టడించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా హోరెత్తించే నినాదాలతో పరిసర ప్రాంతాలను మార్మోగించి, తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఓట్ల కోసం నాటకాలు.. పీఠమెక్కాక దగాలు! ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు నిప్పులు చెరిగారు. "ఓట్ల కోసం అడ్డగోలు హామీలిచ్చి, ప్రజలను నిలువునా ముంచిన చరిత్ర కాంగ్రెస్‌దే. అధికారం చేపట్టి ఇన్ని రోజులైనా 6 గ్యారంటీలకు దిక్కులేదు, 420 హామీలకు అడ్రస్ లేదు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేయకపోతే, కాంగ్రెస్ నాయకులను గడప గడపనా నిలదీస్తాం. పాలన చేతకాకపోతే దిగిపోవాలి తప్ప, ప్రజల సహనాన్ని పరీక్షించొద్దు. వెంటనే స్పష్టమైన రోడ్‌మ్యాప్ ప్రకటించకపోతే కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటాం" అని హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు రాజారెడ్డి, ప్రతాప్, వెంకటేష్ నాయుడు, సి.కె. రంగన్న, జాంపల్లి భరత్ సింహారెడ్డి, రాజశేఖర్, శివ, నరేష్, రామాంజనేయులు, అంజి, వెంకట్రాములు, రాముడు, మల్లికార్జున్, మహేందర్, హరికృష్ణ, వీరేష్‌ల తో పాటు వేలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పాలన: వెయ్యి రోజుల వైఫల్యం

* ఎన్నికల కళ్ళ ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి
* మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో
* కొల్లాపూర్‌లో మహా బైక్ ర్యాలీ నిరసన కార్యక్రమం

చిన్నంబావి మండలం
07 ( వుదయం రిపోర్టర్ )



చిన్నంబావి మండల పరిధిలోని వివిధ గ్రామాల టిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, సీనియర్ కార్యకర్తలు కొల్లాపూర్ లో నిర్వహించే మహా బైక్ ర్యాలీ నిరసన కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ఆరోపించారు. హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ ఆయన ఆధ్వర్యంలో కొల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని వివిధ గ్రామాలలో వివిధ మండలాలలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు కొల్లాపూర్‌లో భారీ మహా బైకు ర్యాలీలో అధిక సంఖ్యలో పాల్గొని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో మహా బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే ఈ నిరసన చేపట్టినట్లు మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తెలిపారు. హామీలు అమలు చేయాలి.. ప్రజలకు న్యాయం చేయాలికాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ..హామీలు అమలు చేయడంలో జాప్యం ఎందుకు? ప్రజలకు ఇచ్చిన మాట ఎప్పుడు నిలబెట్టుకుంటారు? అంటూ నిరసనకారులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వెయ్యి రోజుల పాలనలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగలేదని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం, ఎన్నికల హామీల అమలు కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని బీరం హర్షవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నంబావి మండల పరిధిలోని వివిధ గ్రామాల సీనియర్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో ఈ మహా బైక్ ర్యాలీ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల ఫీజుల కోసం పోరాడితే అరెస్టులా?

* రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి: బీజేపీ నేత ఎస్. రామచంద్రా రెడ్డి

అయిజ
సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి)



పేద విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదల కోసం ఉద్యమిస్తున్న బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్. రామచంద్రారెడ్డి మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు పిలుపు, పాలమూరు ఎంపీ డీకే అరుణ సూచన మేరకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్న బీజేపీ నాయకుల ఇళ్లకు పోలీసులు వెళ్లి ముందస్తు అరెస్టులు చేసి అయిజ పోలీస్‌స్టేషన్‌కు తరలించారని ఆయన తెలిపారు. తెలంగాణలో సుమారు 40 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు పేరుకుపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. "ఫీజు బకాయిల కారణంగా విద్యార్థుల చదువులు ఆగిపోకూడదు.. వారి భవిష్యత్తు ప్రశ్నార్థకం చేయొద్దు" అని రామచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అయిజ పట్టణ బీజేపీ అధ్యక్షులు తెలుగు నరసింహ, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడికొండ భీంసేన్ రావు, ప్రదీప్ స్వామి, భగత్ రెడ్డి, తూముకుంట అంజి, లక్ష్మణ్ గౌడ్, వెంకటేష్‌యాదవ్, రాజశేఖర్, భీమన్న, కుషీ, శ్రీకాంత్, సి. నర్సింహ, వీరేష్ తదితరులు పాల్గొన్నారు

# ఊర్కొండలో కరెంటు కోతలపై రాస్తారోకో

-బీజేపీమండల అధ్యక్షుడు కె రాజేందర్ గౌడ్ ఆధ్వర్యంలో రాత్రి వేళ 6 గంటలు పగటి వేళ 10 గంటలు
-కరెంటు కోతలు లేకుండా ఇవ్వాలి అని రైతుల తరుపున జాతీయ రహదారిపైరాస్తారోకో

ఊర్కొండ న్యూస్ 7
వుదయం ప్రతినిధి



నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఈరోజు కరెంటు కోతలు లేకుండా ఇవ్వాలి అనిరైతుల తరుపున జాతీయ రహదారిపైరాస్తారోకో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అదితిగా బీజేపీ రాష్ట్ర నాయకులుముచ్చర్ల జనార్దన్ రెడ్డి గారు రావడం జరిగిందిఆయన మాట్లాడుతూ మండలం లో కరెంటు ట్రస్ఫర్మర్లు మరియు పోల్స్ అంతరాయం లేకుండా త్వరగా ఏర్పాటు చేయాలని చేయలేని ఎడల మళ్లీ రైతుల తరపున పెద్ద ఎత్తున జిలా sce ఆఫీస్ నీ ముట్టడి చేస్తాం అని మాట్లాడటం జరిగింది ఈ కార్యక్రమం లో పాలుగొన్నవారు రైతులు మరియు బీజేపీ జిలా కార్య వర్గ సభ్యులు లక్ష్మరెడ్డి మరియు బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆంజనేయులు పరుశరామ్ బ్రహ్మచారి వెంకటరెడ్డి వెంకటేష్ శివ శ్రీను సుందర్ రెడ్డి రాములు శేఖర్ రెడ్డి కిరణ్ నాయక్ పూర్ణ వేణునాయక్ ప్రదీప్ గౌడ్ రాజు ఎంఆర్పిఎస్ నాయకులు సందీప్ మల్లేష్ గోపి తదితరులు పెద్దసంఖ్యలో పాలుగొనడం జరిగింది

# కబ్జాదారులు ఎవరో ప్రజలు గమనిస్తూనే ఉన్నారు

* అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే పై బిఆర్ఎస్ ఆరోపణలు తగవు
* నోటికొచ్చినట్లు వాగితే చూస్తూ ఊరుకునేది లేదు.
* రోహిత్ రెడ్డి పక్కన ఉన్న నాయకులు ఊసరవెల్లులు, గోడమీది పిల్లులు

యాలాల
సెప్టెంబర్ 7 వుదయం ప్రతినిధి :-



తాండూరు ప్రాంతంలో కబ్జాలకు పాల్పడిన నాయకులు ఎవరో ప్రజలు గమనిస్తూనే ఉన్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మైపాల్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం యాలాల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహిపాల్ యాదవ్, వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు నర్సిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు అనిల్ కుమార్ గుప్తా, యాలాల పిఎసిఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు భీమయ్య, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వీరేందర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాండూర్ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పై టిఆర్ఎస్ నాయకులు బురద జల్లడం మంచిది కాదన్నారు. తాండూర్ నియోజకవర్గం నుండి గతంలో కాంగ్రెస్ పార్టీ గుర్తు చేతి గుర్తుపై గెలిచిన రోహిత్ రెడ్డి బి ఆర్ఎస్ లో చేరి అటు ఇటు కాకుండా పోయదానికి తెలిపారు. రోహిత్ రెడ్డి గెలుపు కోసం కాంగ్రెస్ కార్యకర్తలు ఎంతో కృషి చేసి గెలిపిస్తే అభివృద్ధి పేరుతో తన సొంత ఖజానా నింపుకున్నారని విమర్శించారు. తాండూర్ ప్రాంతంలోని స్టోన్ పాలిష్ మిషన్ యజమానుల వద్ద కోట్ల రూపాయలు దండుకున్నారని విమర్శించారు. తాండూర్ ప్రాంతాన్ని దోచుకుని తాండూర్ ప్రాంతంలో పెద్ద ఇల్లు నిర్మాణం చేపట్టడం జరిగిందని వివరించారు. లక్ష్మి నారాయణపూర్ చౌరస్తాలో ధర్నాలో రోహిత్ రెడ్డి మాటలకు పొంతన లేదని ఘాటుగా విమర్శించారు. రోహిత్ రెడ్డి పక్కన ఉన్న నాయకులు ఊసరవెల్లులు, గోడ మీద పిల్లులని వ్యాకరించారు. మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన సమయంలో ఓ నాయకుడు గ్రామంలో రాకుండా కంప అడ్డం వేయించారని మరో నాయకుడు ఏలు ఎత్తి ఏమి చేస్తావని ప్రశ్నించిన నాయకులే ఇప్పుడు ఆయన పంచనకు చేరరాని గుర్తు చేశారు. అలాంటి నాయకులే ఇప్పుడు రెచ్చగొట్టి మాట్లాడిస్తున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి మాట్లాడేటప్పుడు జరుగుతున్న అభివృద్ధిని చూసి మాట్లాడితే బాగుంటుందని వివరించారు. ప్రస్తుతం గ్రామాలలో టీఆర్ఎస్ వైపు ఇద్దరు ముగ్గురు కార్యకర్తలు కూడా లేరని అన్నారు.తాండూరు లో జరుగుతున్న అభివృద్ధిపై ప్రస్తుత శాసనసభ్యులు మనోహర్ రెడ్డి చర్చకు సిద్ధమంటున్నారని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో తాండూరు నియోజకవర్గానికి ఎన్ని నిధులు మంజూరు చేశారో ప్రజలకు వివరించాలని సూచించారు. బిఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై విమర్శలు పక్కనపెట్టి అభివృద్ధిపై చర్చించాలని సూచించారు. తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి 1200 కోట్ల రూపాయలు మంజూరు చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలను బి ఆర్ఎస్ నాయకులు కళ్ళు తెరిచి చూడాలని సూచించారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదలకు రేషన్ కార్డులు, 200 యూనిట్ల కరెంటు, ఇందిరమ్మ ఇల్లు,రుణమాఫీ, రైతు భరోసా,సన్న బియ్యం వంటి పథకాలను రాష్ట్రంలోవంటి పథకాల అమలవుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో తాండూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంగలి మల్లయ్య, నర్సింలు, మాజీ డైరెక్టర్లు రాజు, శ్రీనివాస్, అచ్యుతపూర్ మాజీ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ శివయ్య, కాంగ్రెస్ నాయకులు నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ అవమానంపై తీవ్ర ఆగ్రహం

నాగర్ కర్నూల్,
సెప్టెంబర్ 07 (వుదయం బ్యూరో):



రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్ ను కించపరుస్తూ 'కల్పిత నాయకుడు ది ఫ్యాబ్రికేటెడ్ లీడర్' అనే పుస్తకం రాసిన రచయిత హమారా ప్రసాద్ పై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం (టీఎంజేఎఫ్), దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.సోమవారం మాదిగ జర్నలిస్టు వంగూరి జయశంకర్ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ పోలీస్ స్టేషన్ లో సీఐ వెంకట్ రెడ్డిని కలిసి ఫిర్యాదు పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా జయశంకర్ మాట్లాడుతూ అంబేద్కర్ ను 'కల్పిత నాయకుడు' అనడం కోట్లాది మంది దళిత, గిరిజన, బహుజనుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పుస్తకంలో అంబేద్కర్ ను దేశ వ్యతిరేకి, హిందూ వ్యతిరేకి, వేర్పాటువాది అంటూ చిత్రీకరించి సామాజిక వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా రాశారని అన్నారు. ఇది భావ ప్రకటనా స్వేచ్ఛ కాదని, రాజ్యాంగంపై దాడి అని అన్నారు.అంబేద్కర్ ఆర్టికల్ 14ద్వారా సమానత్వపు హక్కు, ఆర్టికల్ 17 ద్వారా అంటరానితనం నిషేధం వల్లే తామంతా గౌరవంగా బతుకుతున్నామని, అలాంటి మహనీయుడిని అవమానిస్తే దేశవ్యాప్త ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. హమారా ప్రసాద్ పై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని, పుస్తకాన్ని ప్రభుత్వం నిషేధించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో టీఎంజేఎఫ్ జిల్లా కన్వీనర్ వెంకటేష్, దళిత దండు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త నాగేష్, జెట్టి కిషోర్, సుధాకర్, మహేష్, వినోద్ పాల్గొన్నారు.

# రైతు కుటుంబానికి స్థిరమైన ఆదాయం కల్పించేలా



* ప్రణాళికలు రూపొందించాలి
* జిల్లా కలెక్టర్ ప్రియాంక

నారాయణపేట టౌన్
సెప్టెంబర్ 7(వుదయం ప్రతినిధి)

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి రైతు కుటుంబానికి ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరేలా, స్థిరమైన ఆదాయ వన రులను కల్పించే విధంగా సమగ్ర ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారు లను ఆదేశించారు. సోమ వారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో కరువు నివా రణ పై జిల్లా కలెక్టర్ ప్రియాంక అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో డ్రాట్ మిటిగేషన్ కార్యక్ర మంలో భాగంగా నారాయణపేట జిల్లా లోని ఉట్కూర్ మండలాన్ని ఎంపిక చేయ గా దానిని అమలు చేసే బాధ్యతను వాసన్ సంస్థ చేపట్టగా సోమవారం కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వాసన్ సంస్థ ప్రతినిధులు డీ పీ ఆర్ ను పవర్ పాయింట్ ప్రజంటే షన్ ద్వారా జిల్లా కలెక్టర్ కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ గ్రామీణ కుటుంబాల అవసరాలు, స్థానిక వనరులు, రైతుల సామర్థ్యాలను పరిగణ లోకి తీసుకుని ఒకే సమగ్ర ప్రణాళిక కింద వివిధ కార్య క్రమాలను అనుసంధానం చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న నిధు లను చిన్నచిన్న కార్యక్రమా లుగా విభజించడం కంటే, ఎక్కువ మంది రైతు కుటుంబాలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే ఒక ప్రధాన ప్రణాళికను రూపొం దించి అమలు చేయాలని తెలిపారు.వ్యవసాయంతో పాటు పశుసంవర్ధక, పౌల్ట్రీ, డెయిరీ, గొర్రెలు, మేకల పెంపకం తదితర లైవ్‌స్టాక్ రంగాలను ప్రణాళికలో భాగం చేయాలని సూచిం చారు. ముఖ్యంగా పౌల్ట్రీ, లైవ్‌స్టాక్ రంగాల్లో ఉన్న అవకాశాలను గుర్తించి, రైతులకు అవసరమైన ఇన్ పుట్స్, సాంకేతిక సహా యం, శిక్షణ, వెటర్నరీ సేవలు, మార్కెట్ లింకేజీ అందేలా సమగ్ర వ్యవస్థను రూపొందించాలని ఆదేశిం చారు.ఒక్కో చోట ఒక యూనిట్ ఏర్పాటు చేసి వదిలేయకుండా, ఉత్పత్తి నుంచి మార్కెటింగ్ వరకు పూర్తి విలువ గొలుసు అభి వృద్ధి చేయాలని కలెక్టర్ సూచించారు. ఉత్పత్తికి అవసరమైన ముడి సరు కులు, ఇన్‌పుట్స్, ఉత్పత్తి, సేకరణ, ప్రాసెసింగ్, నిల్వ, మార్కెటింగ్ వంటి అన్ని అంశాలను సమన్వయం చేయాలని తెలిపారు. గ్రామ పంచాయతీని కేవలం సహ జ వనరుల నిర్వహణ కార్యక్రమాలకు మాత్రమే పరిమితం చేయకుండా, ప్రతి కుటుంబం యొక్క ఆదాయం, ఆహార భద్రత, వ్యవసాయం, పశుసంపద, ఎంటర్‌ప్రైజెస్, ఉపాధి అవ కాశాలను అనుసంధానం చేసే వేదికగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ సూచిం చారు.ప్రతి కుటుంబానికి వారి అవసరాలు, సామర్థ్యాలకు అనుగుణంగా తగిన ఎంటర్‌ప్రైజ్‌ను గుర్తించి, ఆర్థిక సంస్థలు, సంబంధిత శాఖలు, మార్కె ట్ సంస్థల సహకారంతో అమలు చేసే విధంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశిం చారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి,కార్యక్రమ నోడల్ అధికారి సక్రియా నాయక్, ఉద్యాన శాఖ అధికారి సాయిబాబా, జిల్లా మత్స్య శాఖ అధికారి రెహమాన్, వాసన్ సంస్థ ప్రతినిధులు అనిల్ ఉప్పలపాటి, బక్కా రెడ్డి, లక్ష్మణ్, మండల వ్యవసాయ శాఖ అధికారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పాలనలో ప్రభుత్వ వైఫల్యం



*** 6 గ్యారంటీలు... 420 హామీలు ఏమయ్యాయి..? ---మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి**

నారాయణపేట సెప్టెంబర్ 7(వుదయం ప్రతినిధి)

నారాయణపేట జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలును ప్రశ్నిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం తీవ్ర స్థాయిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డి పిలుపుతో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆందోళనలో పాల్గొన్నారు.యాదగిరి రోడ్డులోని బీఆర్ఎస్ క్యాంప్ కార్యాలయం నుంచి భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు కలెక్టరేట్‌కు చేరుకుని ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి ప్రజల సమస్యలు, ప్రభుత్వ హామీల అమలుకు సంబంధించిన అంశాలపై వినతిపత్రం సమర్పించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని చెప్పి అధికారంలోకి వచ్చినప్పటికీ.. నేటికీ అనేక హామీలు కార్యరూపం దాల్చలేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్. రాజేందర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు.ప్రజల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు సేకరించిన 250కిపైగా దరఖాస్తులను కలెక్టర్‌కు అందజేసినట్లు ఆయన తెలిపారు.ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ప్రజల సమస్యలను ఇకనైనా అధికారులు పట్టించుకోవాలని, ప్రతి దరఖాస్తును పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని, అవసరమైన అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ హామీల అమలు కోసం ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష ప్రజాప్రతినిధులపై అసెంబ్లీ పరిసరాల్లో ప్రభుత్వం వ్యవహరించిన తీరుపైనా రాజేందర్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. నల్ల చొక్కాలు, నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అడ్డుకోవడంతో పాటు, తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై దాడికి ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. ఎమ్మెల్యేలు జగదీష్ రెడ్డి, హరీష్ రావులతో పాటు మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల కూడా అనుచితంగా వ్యవహరించారని ఆరోపిస్తూ దీనిని ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన చర్యగా అభివర్ణించారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని ఆయన విమర్శించారు.

నారాయణపేట జిల్లా కేంద్రానికే పరిమితం కాకుండా దామరగిద్ద మండల కేంద్రంలోనూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ప్రజా సమస్యలు, స్థానిక సమస్యల పరిష్కారం కోరుతూ ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ హామీల అమలుతో పాటు స్థానిక ప్రజల సమస్యలపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు విజయసాగర్, మూడవ వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ ,ఏడవ వార్డు కౌన్సిలర్ భరత్ ,మండలం మాజీ అధ్యక్షులు వేపూరి రాములు, నాయకులు సుదర్శన్ రెడ్డి , చెన్నారెడ్డి, కన్న జగదీష్ ,ప్రతాప్ రెడ్డి లతో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో బీఆర్ఎస్ రాస్తారోకో

*** ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ శ్రేణుల భారీ నిరసన**

సంగారెడ్డి వుదయం.

అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్బంధ వైఖరికి నిరసనగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆదేశాల మేరకు సంగారెడ్డిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. "సీఎం డౌన్ డౌన్", "ప్రజా వ్యతిరేక ప్రభుత్వం డౌన్ డౌన్", "బీఆర్ఎస్ గొంతు నొక్కడం ఆపాలి" అంటూ నినాదాలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు బీఆర్ఎస్ శ్రేణులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. అనంతరం పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ విఫల పాలనను అసెంబ్లీలో నిలదీస్తారనే భయంతోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు.ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలులో జరిగిన వైఫల్యాలను ప్రశ్నించకుండా ఉండేందుకే ప్రభుత్వం నిర్బంధ రాజకీయాలకు పాల్పడుతోందని మండిపడ్డారు.

ప్రజల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకతను చూసి సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసహనానికి గురవుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి ప్రశ్నించే హక్కు ఉందని, ఆ హక్కును పోలీసులు, అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని అణచివేయాలని ప్రయత్నించడం సరికాదని స్పష్టం చేశారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత దారుణమని ఆరోపిస్తూ, ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వకుండా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని అన్నారు. పార్లమెంట్‌లో నల్ల టీషర్టులు ధరించి నిరసన వ్యక్తం చేసినప్పుడు తప్పుగా కనిపించని చర్య, తెలంగాణ అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల టీషర్టులు ధరించి నిరసన తెలియజేస్తే ఎందుకు తప్పవుతుందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ప్రతిపక్ష సభ్యులను అడ్డుకోవడం, మహిళా ప్రజాప్రతినిధులతో అనుచితంగా వ్యవహరించడం, పోలీసు బలగాలను ఉపయోగించి నిరసనలను అణచివేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు."పోలీసులను అడ్డుపెట్టుకుని మా గొంతును నొక్కాలని ప్రయత్నిస్తే సహించేది లేదు. ప్రజల సమస్యలు, కాంగ్రెస్ ఎన్నికల హామీల అమలుపై మా పోరాటం మరింత ఉధృతం చేస్తాం" అంటూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.అధికారాన్ని ఉపయోగించి ప్రతిపక్షాన్ని అణచివేయడం కంటే, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.కార్యక్రమంలో మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ సీడీసీ చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, మాజీ గ్రంథాయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, చింత సాయినాథ్, మందుల వరలక్ష్మి, డాక్టర్ శ్రీహరి, మనోహర్ గౌడ్, నాగరాజు గౌడ్, చక్రపాణి, యువజన నాయకులు శ్రవణ్ రెడ్డి, వాజిత్, వేణుగోపాలస్వామితో పాటు పెద్ద ఎత్తున యువకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# 6 గ్యారంటీలు అడుగుతే అరెస్టుల



ఆందోల్ జోగిపేట్ వుదయం

సోమవారం జోగుపేట పట్టణంలో జాతీయ రహదారిపై బిఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు అసెంబ్లీ సమావేశాలకు వెళ్తున్న హరీష్ రావు కేటీఆర్ తో పాటు పలువురు పలువురు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకొని అరెస్టులకు నిరసనగా జోగిపేటలో రోడ్డుపై బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సీఎం డౌన్ అంటూ టిఆర్ఎస్ ఎమ్మెల్యేలను వెంటనే బేసిర్కుల విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు ప్రజాస్వామ్య యుతంగా నిరసన తెలిపే హక్కు ను కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తుందని రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని టీఆర్ఎస్ శ్రేణులు హెచ్చరించాయి మైలా ఎమ్మెల్యేలను కూడా చూడకుండా పోలీసులు వివరిస్తున్న తీరు దుర్మార్గమని పోలీసుల తీరుపై టిఆర్ఎస్ నేతలు మండిపడ్డారు భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో ధర్నా వద్దకు చేరుకొని టిఆర్ఎస్ నేతలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించిన సీఐ అనిల్ కుమార్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు పి నారాయణ ముదిరాజ్ డిబి నాగభూషణం మల్కాజిగిరి గుట్ట మున్సిపల్ కౌన్సిలర్ పట్లూరి శివశంకర్ బి ఆర్ఎస్ నాయకులు లింగా గౌడ్ వెంకటేశం సార్ శ్రీధర్ బిర్లా శంకర్ మహేష్ యాదవ్ నాగరాజు కర్ణాకర్ పల్లె వెంకటరమణ విజయ్ కుమార్ ఇమ్రాన్ ఖాన్ బి ఆర్ఎస్ నాయకులుపాల్గొన్నారు అల్లాదుర్గం 161 రహదారిపై మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ బి ఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్టు నిరసనగా ధర్నా చేస్తే పోలీసులు అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యం ఎక్కడ పోతుంది అంటూ తీరవంగ ఖండించిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జైపాల్ రెడ్డి నారాయణ లింగాగౌడ్ కౌన్సిలర్ పట్లూరి శేఖర్ టిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు

# నూతన ఎక్సైజ్ సీఐగా ఏడుకొండలు



ఆందోల్ జోగిపేట్ వు దయం

సోమవారం నూతన ఎక్సైజ్ సీఐగా జోగుపేట సర్కిల్ కార్యాలయంలో జోగిపేట సిఐ అనిల్ కుమార్ నికార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు జోగుపేట సిఐ అనిల్ కుమార్ మాట్లాడుతూ ఆందోల్ మండల పరిధిలో ఆయా గ్రామాల్లో బెల్టు షాపులపై నిగ ఉంచాలని నూతన ఎక్సైజ్ సీఐ ఏడుకొండలకు తెలిపారు రానున్న వినాయక చవితి పండుగ దృష్టిలో ఉంచుకొని మండపాల వద్ద మద్యపానం త్రాగకుండా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ సిఐ కి సి అనిల్ కుమార్ తెలిపారు

# అరెస్టులపై గులాబీ గర్జన!

**ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అరెస్టులకు నిరసనగా గద్వాల కలెక్టరేట్ ముట్టడి.. రోడ్డుపై బైఠాయించి భారీ ధర్నా**

గద్వాల సెప్టెంబర్ 07 (వుదయం కరస్పాండెంట్)



బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ గద్వాలలో ఆ పార్టీ శ్రేణులు కదంతొక్కాయి. అరెస్టులను తీవ్రంగా ఖండిస్తూ బీఆర్ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావడంతో కలెక్టరేట్ పరిసరాలు నినాదాలతో మార్మోగాయి. రోడ్డుపై బైఠాయించి నిరసన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అరెస్టులకు నిరసనగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైఠాయించారు. పోలీసుల తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజా ప్రతినిధుల అరెస్టు పేరుతో నిరసనలను అణచివేయడం సరికాదని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టులకు తక్షణమే నిరసనగా పార్టీ శ్రేణులు రోడ్డెక్కి తమ ఆందోళనను బలంగా వినిపించారు. భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు బాసు హనుమంతు నాయుడు పిలుపుతో నిర్వహించిన ఆందోళనకు మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్. కేశవ్, మాజీ జడ్పీటీసీ బాసు శ్యామల, నాగర్ దొడ్డి వెంకట్రాములుతో పాటు పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. కౌన్సిలర్లు పులిపాటి వెంకటేష్, కమ్మరి సునీత రాము, లత రామకృష్ణ, చిత్తరి మంజుల రాణి కిరణ్, చంటన్న, టీఎన్ఆర్ జగదీష్, గువ్వల గోపాల్, నరసింహులు, దుబన్న, మోహన్ యాదవ్, సాకి డేవిడ్, జి. రాఘవేంద్ర రెడ్డి, కోటేష్, ప్రతాప్, వెంకటేష్ నాయుడు, లక్ష్మీకాంత్ రెడ్డి, రాజారెడ్డి, బీచుపల్లి, గంజిపేట రాజు, చక్రిధర్ రెడ్డి, జాంపల్లి భరత్ సింహారెడ్డి, శ్రీరాములు, కురవ పల్లయ్య, ముని, సి.కె. రంగన్న, సోమశేఖర్ రెడ్డి, రాజశేఖర్, గోపాల్, నాగరాజు, శివ, రాముడు, శ్రీనివాస్, మహేష్, కృష్ణ, మోహన్, భాస్కర్, రామకృష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ శ్రేణుల భారీ ఆందోళనతో కలెక్టరేట్ పరిసరాల్లో కొద్దిసేపు రాజకీయ వేడి నెలకొంది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అరెస్టులను నిరసిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా పార్టీ శ్రేణులు తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశాయి.

# పబ్లిక్కు ఆశపెట్టి గోసపెడుతున్న కాంగ్రెస్ ...



**మండల బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు....**

వుదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 7.....

మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలో నేడు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు వంట వార్పు నిర్వహించారు. అనంతరం . మండల కేంద్రంలో నేడు ప్రజావాణి కార్యక్రమంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రాజా రమణా గౌడ్ ఆధ్వర్యంలో బి ఆర్ ఎస్ మండల సీనియర్ నాయకులు పబ్బ రమేష్ గుప్తా. మెదక్ జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్ర గౌడ్ తో కలిసి ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మకు బాకీ కాదు అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వము రైతులను కడుపులో పెట్టుకొని చూసుకుంది రైతులకు 24 గంటల కరెంటు. ఆడబిడ్డ పెళ్లికి కళ్యాణ లక్ష్మి. రైతులకు వ్యవసాయ ఖర్చులకోసం రైతుబంధు. రాత్రనకా పగలనకా పకృతి విపత్తులతో పోరాడుతూ ఓడిపోయిన రోజురైతు కుటుంబ సభ్యులను ఓదార్చే విధంగా రైతు బీమా పథకం ద్వారా ఐదు లక్షల రూపాయలు కుటుంబానికి ఆసరాగా నిలిచాడు. బిడ్డ పుడితే 13000. మగ పిల్లగాడు పుడితే 12000. కెసిఆర్ కిట్టు ఇలా ఇచ్చి ప్రజలను తోబుట్టువులాగా చూసుకుంటూ వచ్చింది కెసిఆర్ ప్రభుత్వం.నేడు పరిపాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వం 420 హామీలు ఇచ్చి గద్దెనెక్కి వెయ్యి రోజుల పరిపాలన అంటూ సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉంది. ఉందని. స్త్రీలకు 2500 రూపాయలు. వికలాంగులకు 6000 రూపాయలు పించెను. వృద్ధులకు 4000 రూపాయల పింఛను. 6 గ్యారంటీలు 420 హామీలు ఇచ్చి ప్రజలను గోషపెడుతున్నారని వారు మండిపడ్డారు. తక్షణమే ప్రభుత్వంకు చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో మహేందర్ రెడ్డి. హనుమంత్ రెడ్డి. కృష్ణారావు. ఆయా గ్రామాల సర్పంచులు ప్రవీణ్ గౌడ్. నారాయణరావు. అశోక్ రెడ్డి. బ్యాగరీ నరసయ్య. ముత్యాలు. చెన్నాపూర్ కొమురయ్య. లావణ్య అశోక్. రాజు. నాయకులు మహిపాల్ రెడ్డి. నరేందర్. కొండల్. చిన్నాపూర్ ఆంజనేయులు ముదిరాజ్. రామచంద్ర గౌడ్.ఆయా గ్రామాల మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పట్ల పోలీసుల ప్రవర్తన దారుణం.....



**మెదక్ జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్......**

వుదయం న్యూస్ శివ్వంపేట సెప్టెంబర్ 7.....

నర్సాపూర్ శాసన సభ్యురాలు వాటి సునీత లక్ష్మారెడ్డి కి అసెంబ్లీ బయట అవమానం. మెదక్ జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్ మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం ఎలక్షన్ కి ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు వెయ్యి రోజులు గడిచినప్పటికీ నేటి వరకు అమలు చేయక 420 హామీలను ఇచ్చి గద్దెనెక్కి ఇప్పుడు హామీలు నెరవేర్చాలని ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని అసెంబ్లీ వేదికగా వెళ్తుండగా పోలీసులను పెట్టి కొట్టియడం అక్రమ అరెస్టులు చేయడం ప్రభుత్వం చేతగానితనమని ఈ దారుణమని సభ్య సమాజం తలదించుకుంటుందని మెదక్ జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్ ఎద్దేవ చేశారు . ఇలాంటి దుశ్చర్యను ఖండిస్తున్నామని వారన్నారు. ప్రభుత్వం ఇకనైనా బుద్ధి తెచ్చుకుని ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని లేనియెడల కాంగ్రెస్ పార్టీకి ప్రజలే గుణపాఠం చెప్పే రోజులు ముందున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేకపోతు గంభీర్యాలు మానుకోవాలని ఆయన హితువు పలికారు.

# 'మడి 'కాదు.. మదిలోని భావం ముఖ్యం...





శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్....

మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో కొలువుదీరిన శ్రీ దత్తాత్రేయ మహాస్వామి. శిరిడి సాయిబాబాకు నేడు శ్రావణ మాసం బహుళ ఏకాదశి పురస్కరించుకొని శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన అర్చకులు నటరాజ్ శర్మ ఆధ్వర్యంలో శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్ పెద్ద గౌని జిన్నారం శివకుమార్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మడి కాదు మదిలోని భావం ముఖ్యమని ఆయన ఇలా వివరించారు. బాబా తన భక్తుల్ని పరీక్షించడానికి ఎన్నో చమత్కారాలను చేసేవారని తెలుసుకున్నాం కదా! ఇది కూడా అలాంటిదే!ఒక ఏకాదశి నాడు బాబా దాదాకేల్కరుకు డబ్బిచ్చి మాంసాన్ని తీసుకురమ్మన్నారు. ఏకా దేశి నాడు హిందువులు మాంసం తినరు. పైగా కేల్కరు సదాచార బ్రాహ్మణుడు, అయినా బాబా అంటే అతనికి ఎక్కడలేని గురి, మరేం ఆలోచించకుండా మాంసం తీసుకురావడానికి బయల్దేరాడు. ఇంతలో బాబా అతణ్ణి ఆపి 'నువ్వే పోనవసరం లేదు. మరెవరినైనా పంపు' అన్నారు. కేల్కరు పాండు అనే నౌకరును పురమాయించాడు. అతను బయల్దేరబోతుండగా బాబా మళ్లీ ఆపేశారు. కేల్కరు గురువాజ్ఞను అమలు చేస్తాడా? లేదా? పరీక్షించేందుకే బాబా ఇలా చేశారు. మరోసారి బాబా దాదా కేల్కరును పిలిచి పొయ్యి మీదున్న పలావు ఉడికిందో లేదో చూడ మన్నారు. కేల్కరు దానిని రుచి చూడకుండానే బాగానే ఉందని చెప్పాడు. "నువ్వు కళ్లతో దానిని చూడలేదు. నాలుకతో రుచి చూడలేదు. బాగానే ఉందని ఎలా చెప్పావు?" బాబా ఇలా ప్రశ్నిస్తూ కేల్కరు చేతిని మరుగుతున్న పాత్రలో పెట్టారు."ఇక నీ చెయ్యి తియ్యి. నీ ఆచారాన్ని ఒక పక్కన పెట్టు. తెడ్డుతో తీసి కొంచెం ప్లేటులో వేసు కుని ఉడికిందీ లేనిదీ తెలుసుకో" అన్నారు బాబా.ఈ రెండో పరీక్షలో కేల్కరు ఓడిపోయాడు. బ్రాహ్మణుడవడం వల్ల మాంసాహారం తిన దానికి సంశయించక అలా చేశాడన్న మాట. నిజానికి ఏ గురువూ, యోగీ తన శిష్యుడిని నిషిద్ధాహారం తిని చెడిపొమ్మని చెప్పరు కదా? కానీ తాము చెప్పిన ఆజ్ఞ నెరవేరుస్తాడా? లేదా? అనేది తెలుసుకోవడానికి బాబా ఈ పరీక్ష పెట్టారన్న మాట అని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు ట్రస్టు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# లంగారుకుంటలో చెత్త డంపింగ్‌పై ఫిర్యాదు



వుదయం న్యూస్ శివ్వంపేటసెప్టెంబర్ 7....

గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తను నిబంధనలకు విరుద్ధంగా గ్రామంలోని లంగారుకుంటలో డంపింగ్ చేస్తున్నారని శభాష్‌పల్లి మాజీ సర్పంచ్ పార్వతి సత్యం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా పార్వతి సత్యం మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతిరోజూ ఇళ్ల నుంచి సేకరిస్తున్న తడి, పొడి చెత్తను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెత్తను డంపింగ్ యార్డ్ కు తరలించకుండా లంగారుకుంటలో వేస్తుండటంతో అక్కడ చెత్త కుప్పలుగా పేరుకుపోతోందని అన్నారు. దీంతో దుర్వాసన వెదజల్లడం జరుగుతుందన్నారు. స్వయంగా సర్పంచ్ గ్రామపంచాయతీ సిబ్బందిచే చెత్తను కుంటలోకి తరలించడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఈ విషయమై ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

# రూ.1.50 కోట్లతో బసాపురం– తుమ్మలచెరువు స్టేజీ బీటీ రోడ్డు



*** భూమిపూజ చేసి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి**

గద్వాల సెప్టెంబర్ 07 (వుదయం కరస్పాండెంట్)

గద్వాల జిల్లా గట్టు మండలం బసాపురం గ్రామం నుంచి తుమ్మల చెరువు స్టేజీ వరకు రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీరాములు గౌడ్ ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు.

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల నుంచి ప్రధాన రహదారులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ఏళ్లుగా గ్రామస్థులు ఎదురుచూస్తున్న బసాపురం-తుమ్మలచెరువు స్టేజీ రోడ్డు పూర్తయితే ప్రజల రాకపోకలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు.

కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ హనుమంతు, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఉపసర్పంచ్ అంజి, నాయకులు ఆనంద్‌గౌడ్, ఊరుకుంది, నారాయణరెడ్డి, ఉమర్, ప్రకాష్‌రెడ్డి, రాజప్ప, రంగప్ప, వీరేష్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏకాంబరి రామలింగేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు



(సెప్టెంబర్ 7 బషీరాబాద్ వుదయం)

* కన్నుల పండుగగా రథోత్సవం

శ్రావణ మాస ఆఖరి సోమవారం పురస్కరించుకొని కర్ణాటక రాష్ట్ర సరిహద్దు బషీరాబాద్ మండల నీళ్లపల్లి గ్రామ శివారు దట్టమైన అటవీ ప్రాంతంలో సప్త గుండాల మధ్యలో వెలసిన ఏకాంబరి రామలింగేశ్వర ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం భక్తిశ్రద్ధలతో గర్భగుడిలో పాలాభిషేకం, జలాభిషేకం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమీప కన్నడ భాష భక్తులు దర్శించుకునేందుకు రావడంతో అక్కడక్కడ ప్రాంతీయేతర సంస్కృతి ఉట్టిపడింది.

ప్రత్యేక సదుపాయాలు.. ఆరాధకులు మొక్కులు తీర్చుకునేందుకు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో ఆలయ కమిటీ సభ్యులు తాగునీటి, అన్నదాన వితరణ అందజేశారు. ప్రయాణికుల సౌకర్యం రీత్యా తాండూరు బస్సు డిపో నుంచి ప్రతి గంటకు ప్రత్యేక బస్సుల సర్వీసులను నడిపించారు. దొంగలు, అపరిచిత్రుల నుంచి అప్రమత్తంగా ఉండాలంటూ ఆలయ ప్రాంగణం నాలు దిక్కుల మైకులు ఏర్పాటు చేసి భక్తులకు సూచనలు ఇచ్చారు. పోలీస్ సేవలు భేష్..తాండూర్ డీఎస్పీ నర్సింగ్ యాదయ్య, గ్రామీణ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు కల్పించారు. సప్త గుండాల సమ్మేళనంతో ఓ సముద్ర కొలను గా భక్తులకు నేత్రానందా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీస్ సిబ్బంది సేవలు అందించారు. ఉత్సవాలలో తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ధారాసింగ్, రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యులు రమేష్ మహారాజ్, మండల మాజీ జెడ్పిటిసి రాకేష్ మహారాజ్, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి. నీలపల్లి సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి. జైవీర్లాల్. ఏఎంసి డైరెక్టర్ వెంటప. సీనియర్ నాయకులు సుధాకర్ రెడ్డి. ముకుంద. మహేందర్. సూర్య నాయక్. మాజీ సర్పంచులు ఆలయ కమిటీ ట్రస్ట్ సభ్యులు యువత ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రజలకు భక్తులకు సౌకర్యాలు కల్పించడం జరిగింది.

# బ్రాహ్మణపల్లి రైల్వే గేట్ వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలని వినతి.

వుదయం న్యూస్ శివంపేటసెప్టెంబర్ 7....



నర్సాపూర్-గజ్వేల్ నియోజకవర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న బ్రాహ్మణపల్లి రైల్వే గేట్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, అక్కడ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని బీజేపీ నాయకులు కోరారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సూచన మేరకు బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే కార్యాలయంలోజీఎం కిరణ్‌కుమార్‌ను కలిసి సమస్యను వివరించారు.

ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్‌రావు ఇచ్చిన వినతిపత్రాన్ని జీఎంకు అందజేశారు. సమస్యను పరిశీలించి అతి త్వరలో బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపడతామని రైల్వే జీఎం హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి అశోక్ సాదుల, ఎరుకల భిక్షపతి, అల్లీపూర్ సర్పంచ్ చింతకాయల కుమార్, మండల ఉపాధ్యక్షుడు అయ్యగారి షాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

# తాత మధు వెంటనే క్షమాపణ చెప్పాలి



* దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు: టీపీసీసీ కార్యదర్శి దాడిగ సందీప్ రాజ్
* చిలకలగూడలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

ముషీరాబాద్, సెప్టెంబర్ 7(వుదయం)

అసెంబ్లీ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని టీపీసీసీ కార్యదర్శి దాడిగ సందీప్ రాజ్ అన్నారు. చిలకలగూడలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని తాత మధు వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సందీప్ రాజ్ మాట్లాడుతూ, బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి దళిత స్పీకర్‌ను, మహిళా సమాజాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తాత మధు వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని దళిత సమాజానికి, మహిళా లోకానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.మహిళలు, దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన తాత మధును వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తాత మధు వ్యాఖ్యలను తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాలని కోరారు.

ప్రజాప్రతినిధిగా, బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరమని సందీప్ రాజ్ విమర్శించారు. తాత మధు తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పకపోతే నిరసనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ డీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ శ్యాంసుందర్, చిలకలగూడ డివిజన్ అధ్యక్షుడు జహంగీర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయికుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శిల్పా చారి, చక్రధర్, బచ్చి, డీసీసీ వైస్ చైర్మన్ వివేక్, సికింద్రాబాద్ నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్ చింతల రాజేందర్, వైస్ చైర్మన్ చక్రపాణి, వరలక్ష్మి, రామలీల, ఉమ తదితరులు పాల్గొన్నారు.

# అవంతి డిగ్రీ & పీజీ కళాశాలలో ఓరియంటేషన్ డే



ముషీరాబాద్, సెప్టెంబర్ 07(వుదయం)

హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవంతి డిగ్రీ & పీజీ కళాశాల ఆధ్వర్యంలో "విద్యారంభ-2K26" ఓరియంటేషన్ డే, ఇన్వెస్టిచర్ సెర్మనీ నిర్వహించనున్నారు.సెప్టెంబర్ 7వ తేదీ ఉదయం 10గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో MBA, MCA ప్రథమ సంవత్సరం పీజీ విద్యార్థులు పాల్గొననున్నారు.ఈ కార్యక్రమానికి ఉస్మానియా యూనివర్సిటీ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇంద్రకాంతి శేఖర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.అలాగే ఉస్మానియా యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన డాక్టర్ బి. సుజాత, JNTUH స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌కు చెందిన ప్రొఫెసర్ ఎ. సంతోష్ కుమారి గౌరవ అతిథులుగా పాల్గొననున్నారు.బ్రహ్మకుమారీస్ హిమాయత్‌నగర్ ఇన్‌చార్జ్ అంజలి సిస్టర్ ప్రత్యేక అతిథిగా హాజరుకానున్నారు. అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజెస్ వ్యవస్థాపక చైర్మన్, ఆంధ్రప్రదేశ్ మాజీ పర్యాటక, సాంస్కృతిక, యువజనాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ ఎం. శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొననున్నారు.ఈ సందర్భంగా కొత్తగా చేరిన విద్యార్థులకు కళాశాల విద్యా విధానాలు, భవిష్యత్ అవకాశాలు, ఉన్నత విద్య మరియు కెరీర్‌పై అవగాహన కల్పించనున్నారు. కార్యక్రమంలో విద్యార్థులకు ప్రేరణ కలిగించే పలు అంశాలపై అతిథులు ప్రసంగించనున్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టులపై గుమ్మడిదలలో నిరసన



- ధర్నా, రాస్తారోకో నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు

గుమ్మడిదల, సెప్టెంబర్ 7 (వుదయం):

అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ గుమ్మడిదలలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారని ఆరోపిస్తూ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పద్ధతిలో అసెంబ్లీకి వెళ్తున్న ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయడం సరికాదని అన్నారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించే ప్రజాప్రతినిధులకు తమ విధులను నిర్వర్తించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లీలావతి ముందస్తు అరెస్ట్



శంకర్ పల్లి సెప్టెంబర్ 07 (వుదయం)

విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో శంకర్‌పల్లి మండల బీజేపీ అధ్యక్షురాలు లీలావతి బయానంద్‌ని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. సెప్టెంబర్ 7న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బీజేపీ పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలతో పాటు విద్యార్థులకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలని, విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని పార్టీ నాయకులు కోరుతున్నారు.ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపేందుకు సిద్ధమైన లీలావతి బయానంద్ను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని బీజేపీ శ్రేణులు తీవ్రంగా ఖండించాయి. సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం నిరసనలను అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం కొనసాగుతుందని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు.

# 1000 రోజులైనా 6 గ్యారంటీలు, 420 హామీల సంగతేంటి ?



* బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్

నిజాంపేట్, సెప్టెంబర్ 7,(వుదయం ప్రతినిధి ),

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 1000 రోజులు గడిచినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలు, పూర్తి స్థాయిలో అమలు కాలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నేతలు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజావాణిలో ఎన్ఎంసీ మాజీ డిప్యూటీ మేయ్ ధనరాజ్ యాదవ్, నిజాంపేట్ సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో జాప్యం జరుగుతోందని, ఆరు గ్యారంటీలను అర్హులందరికీ అమలు చేయడంతో పాటు, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన 420 హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేసారు.ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలయ్యే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# 420 హామీలను అమలు చేయాలి



గుమ్మడిదల ప్రజావాణిలో బీఆర్ఎస్ నాయకుల వినతి

గుమ్మడిదల, సెప్టెంబర్ 7 (వుదయం):

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు.బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, పార్టీ నాయకులు ప్రజావాణికి హాజరై తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయడంతో పాటు, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వానాకాలం వరి కొనుగోళ్లపై కలెక్టర్ సమీక్ష



* రైతులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశం

నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 07 (వుదయం బ్యూరో):

వానాకాలం వరి కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్ చెన్నయ్యతో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పౌర సరఫరాలు, వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ఇబ్బందులు లేకుండా విక్రయించేలా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి తూకం యంత్రాలు, గన్నీ సంచులు, టార్పాలిన్లు, నిల్వ సౌకర్యాలు సిద్ధం చేయాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలను పరిశీలించి అర్హత కలిగిన ధాన్యాన్ని జాప్యం లేకుండా కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు రవాణా ఏర్పాట్లు ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని, సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించేందుకు మండల, జిల్లా స్థాయిలో సమన్వయ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

# రవీందర్ రెడ్డి పుస్తకానికి గుర్తింపు

షాద్‌నగర్



సివిల్స్ వాళ్లకు గ్రూప్ 1 గ్రూప్ 2 ఉద్యోగాలకు ఇలాంటి పుస్తకం ఎంతో మేలు చేస్తుందని అభినందించిన ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఏఎస్ చక్రవర్తి . మా లైబ్రరీ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది సిటీ సెంట్రల్ లైబ్రరీ చిక్కడ్ పల్లి సెక్రటరీ ఎమ్.అలివేలు.ఉపయోగపడే ఇంకా ఇలాంటి గ్రంథాలు రాయాలని కోరి అభినందించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలల రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె సురేందర్ రెడ్డి. మా కళాశాల నుండి ఇలాంటి అధ్యాపకులు ఉన్నందుకు సంతోషం వ్యక్తం చేసి అభినందించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం హిమబిందు.తెలుగు మీడియంలో కూడా రాయమని, మాకు గ్రూప్స్ కోసం ఎకనామిక్స్ అవగాహన క్లాసులు చెప్పమని కోరిన సెంట్రల్ లైబ్రరీ విద్యార్థులు. అర్థశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్ రెడ్డి రచించిన, తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా ఆవిష్కరించబడిన 'ఇండియన్ ఎకానమీ' పుస్తకానికి అరుదైన గుర్తింపు లభించింది. షాద్ నగర్ కు చెందిన , రాజేంద్రనగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త డాక్టర్ సామ రవీందర్ రెడ్డి రచించిన ఈ పుస్తకాన్ని ఈరోజు ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీలో, చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీకి రిఫరెన్స్ బుక్‌గా అందచేశారు. భారత ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన సమకాలీన అంశాలు, గణాంకాలు, పోటీ పరీక్షలకు అవసరమైన విషయాలను సమగ్రంగా పొందుపరిచిన ఈ పుస్తకం విద్యార్థులు, పరిశోధకులు, యుపిఎస్సి సివిల్స్‌తో పాటు గ్రూప్ వన్, గ్రూప్ టు మరియు ఇతర పోటీ పరీక్షల అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని దేశం లోనే గుర్తింపు ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఏఎస్ చక్రవర్తి పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో వేల మందికి ఉద్యోగాలు రావడానికి నిలయమైన సిటీ సెంట్రల్ లైబ్రరీ చిక్కడ్ పల్లి సెక్రటరీ ఎమ్ అలివేలు ఇలాంటి పుస్తకాలు రాయడం అరుదుగా మారిందని రిఫరెన్స్ గా ఇచ్చినందుకు అభినందించారు. అక్కడి విద్యార్థులతో కలిసి స్వీకరించారు..ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు రచించిన పుస్తకం ఎన్నో వేల మందికి ఉద్యోగాలు రావడానికి నిలయమైన ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీలో మరియు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు ఉన్న సెంట్రల్ లైబ్రరీలో రిఫరెన్స్ గ్రంథంగా స్థానం పొందడం పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కే సురేందర్ రెడ్డి అభినందించారు.అలాగే రాజేంద్రనగర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నిమిన్ గారు కూడా రవీందర్ రెడ్డిని అభినందించారు.అలాగే విద్యావేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన, సమగ్ర విజ్ఞానాన్ని అందించాలనే లక్ష్యంతో తాను ఈ పుస్తకాన్ని రచించినట్లు తెలిపారు. భవిష్యత్తులో మరికొన్ని పోటీ పరీక్షల సామాజిక సమస్యల విజ్ఞాన గ్రంథాలను అందుబాటులోకి తేవడానికి కృషి చేస్తానని డాక్టర్ సామ రవీందర్ రెడ్డి తెలిపారు.

# శ్రీ వాగ్దేవిలో ఉపాధ్యాయ దినోత్సవం





జిన్నారం 7 సెప్టెంబర్ (వుదయం ప్రతినిధి)

బొల్లారం డివిజన్ పరిధిలోని శ్రీ వాగ్దేవి పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిన్నారం పటాన్చెరువు మండలాల విద్యాధికారులు విజయ్ కుమార్ నాగేశ్వర్ నాయక్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఉదయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గురువు అంటే కేవలం పాఠాలు చెప్పే వ్యక్తి కాదని విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసే మార్గదర్శి అని ముఖ్య అతిథులు కొనియాడారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి ఉన్నత శిఖరాల వైపు నడిపించే మహోన్నత వ్యక్తి గురువు అని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యాధికారులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యావేత్తలు హరికృష్ణ రెడ్డి, ప్రభు కుమార్, సింహాచలం, కిషోర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# గంగ కత్వ కాలువకు నిధులు

సంగారెడ్డి వుదయం



సదాశివపేట మండలం సూరారం గ్రామం నుండి మొదలయ్యే నిజాం కాలం నాటి గంగ కత్వ కాలువ ఆధునీకరణ కు జగ్గారెడ్డి చొరవతో ఎట్టకేలకు మోక్షం లభించింది. నిజాం కాలం లో నిర్మించిన ఈ కాలువ ఇప్పటివరకు మరమ్మత్తు కు నోచుకోలేదు. దశాబ్దాల పాటు మరమ్మత్తుల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపుతున్న పనులకు మోక్షం కలుగలేదు. గంగ కత్వ ఆయకట్టు రైతులు , స్థానిక నేతల కోరిక మేరకు జగ్గారెడ్డి మూడు నెలల క్రితం నీటి పారుదల శాఖ అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆధునీకరణ పనుల కోసం వెంటనే కొత్త ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. కాలువ ఆధునీకరణ పనులకోసం నీటి పారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ఆ ప్రతిపాదనలకు ఆమోదిస్తూ రూ 37.81 కోట్లు మంజూరు కు పరిపాలన అనుమతులు జారీ చేస్తూ నీటిపారుదలశాఖ జీవో విడుదల చేసింది. గంగ కత్వ కాలువకు నిధులు మంజూరు పై జగ్గారెడ్డి, డిసిసి అధ్యక్షురాలు నిర్మల ఆనందం వ్యక్తం చేశారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క లకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.ఆధునీకరణ పనులు ఇలా...గంగ కత్వ కాలువ సదాశివపేట మండలం సూరారం గ్రామం లో ప్రారంభం అయ్యి 11 గ్రామాలను కలుపుతూ సదాశివపేట మండలం లోని మాచిరెడ్డి పల్లి గ్రామం వరకు సుమారు 15 కిలో మీటర్ల పొడవునా విస్తరించి ఉంది. గంగకత్వ కాలువ కు 33 చెరువుల నుండి ఫీడర్ చానల్స్ ఉన్నాయి. ఆధునీకరణ పనుల్లో భాగంగా కాలువకు లైనింగ్ పనులు చేపడతారు. కాలువ పైన అవసరం ఉన్న చోట కొత్త బ్రిడ్జిల నిర్మాణం, పాత వాటికి మరమ్మత్తు పనులు చేస్తారు. దీనితో పాటు కాలువ పొడవునా తుములకు రిపేర్లు చేస్తారు. ఈ కాలువ పనులు పూర్తయితే 3000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దుస్తులు, షూస్, పుస్తకాల పంపిణీ



ధరూర్ సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి)

గద్వాల జిల్లా ధరూర్మండలంలోని బూరెడ్డిపల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న కిట్లలో భాగంగా దుస్తులు, షూస్, పుస్తకాలను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని ప్రభుత్వం అందించడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విజయుడు, గ్రామ పెద్దలు, పంచాయతీ కార్యదర్శి, పాఠశాల ఉపాధ్యాయులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలం



* జిన్నారం మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి

జిన్నారం 7 సెప్టెంబర్(వుదయం ప్రతినిధి)

కాంగ్రెస్ పార్టీ నేతలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలో 420 హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలం చెందారని జిన్నారం మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలు అమలు చేయలేదని చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్ ను కలిసి ప్రజావాణి కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులతో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇచ్చిన హామీలు వంద రోజుల్లో అమలు చేస్తామని సంతకాలు చేసి ఇంటింటికి గ్యారెంటీ కార్డులు పంచారని, హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనపై ఎమ్మెల్యేలను ఎమ్మెల్సీలను అడ్డుకోవడం సరైనది కాదని సమావేశాలకు పిలిచి అడ్డుకోవడం ఏంటని ప్రభుత్వాన్ని నిలదీశారు. విపక్షాల ప్రశ్నల నుంచి తప్పుకోవడానికి ఇలాంటి చర్యలకు ప్రభుత్వం పాల్పడుతుందని తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు అవసరమైతే ప్రజాక్షేత్రంలో తమ పోరాటం ఆపేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు హనుమంత్ రెడ్డి సాయి కిరణ్ రెడ్డి శ్రీకాంత్ యాదవ్ సతీష్ బీరప్ప యాదవ్ మాజీ ఎంపీటీసీలు రత్నం లక్ష్మి నాయుడు మునీర్ నాయకులు జైపాల్ రెడ్డి శ్రీశైలం తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమం ఆగదు

నాగర్ కర్నూల్, సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి):

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్ రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.సోమవారం ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్ షిప్ బకాయిలకు నిరసనగా ధర్నా చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు మద్దతుగా హైదరాబాద్ వెళుతున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలను జిల్లా వ్యాప్తంగా అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ల ఖండించారు.గత నెల రోజులుగా విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు చెల్లించాలని బీజేపీ పోరాడుతుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బకాయిల వల్ల విద్యార్థుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయని, ఇప్పటికైనా ప్రభుత్వం బుద్ధి తెచ్చుకుని పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ హామీలు - అమలు వైఫల్యం

* బిఆర్ఎస్ పదేళ్ల అభివృద్ధి... కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలపై చర్చకు సిద్ధమా
* ఎమ్మెల్యే వంశీకృష్ణకు మాజీ ఎమ్మెల్యే మర్రి సవాల్ - అచ్చంపేటలో అధికార పార్టీకి కౌంట్ డౌన్ మొదలైంది

అచ్చంపేట , సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి):



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులైనా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మొండిచేయి చూపుతోందని మాజీ ఎమ్మెల్యే, అచ్చంపేట సమన్వయకర్త డా. మర్రి జనార్ధన్ రెడ్డి ఆరోపించారు.

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం అచ్చంపేట పట్టణంలోని మినీ ఎన్టీఆర్ స్టేడియం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది రైతులు, కార్యకర్తలు బీఆర్ఎస్ జెండాలు, ప్లకార్డులతో "రెండు లక్షల ఉద్యోగాలు.. వెయ్యి రోజులైనా గతి లేదు" అంటూ నినాదాలతో పట్టణం హోరెత్తించారు. అనంతరం సబ్ స్టేషన్ ఎదుట నిరసన చేపట్టి అధికారులకు వినతిపత్రం అందజేశారు.

అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో మర్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో చేసింది మూడు మాత్రమేనని, మరో 30 హామీలను ఎగ్గొట్టిందని విమర్శించారు. ఆడబిడ్డలకు తులం బంగారం హామీ ఏమైందని ప్రశ్నించారు. ఎగ్గొట్టిన హామీలపై చర్చకు ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సిద్ధమా అని సవాల్ విసిరారు.అచ్చంపేట కోసం కొట్లాడి ఒక్క ప్రాజెక్టునైనా తెచ్చావా అని ఎమ్మెల్యేను నిలదీశారు. నల్లమల ముద్దుబిడ్డ సీఎం రేవంత్ రెడ్డి అని చెప్పుకునే ఎమ్మెల్యే అచ్చంపేటకు ఏం తీసుకొచ్చారో చెప్పాలని, కొడంగల్, కొండారెడ్డిపల్లికి ఎన్ని నిధులు ఇచ్చారో, అచ్చంపేటకు ఎన్ని ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీకాంత్ భీమా మాట్లాడుతూ.. అచ్చంపేటలో అధికార కాంగ్రెస్ పార్టీకి కౌంట్ డౌన్ మొదలైందని అన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని, ఎమ్మెల్యే వంశీకృష్ణ కల్లబొల్లి మాటలు చెబుతున్నారని ఆరోపించారు. అంబేద్కర్ సాక్షిగా బీఆర్ఎస్ క్యాడర్ కదం తొక్కుతోందని, ప్రజా సమస్యలపై పోరాటం ఆగదన్నారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మనోహర్, నరసింహ గౌడ్, తులసిరామ్ తదితర మండలాల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి: నో మ్యాపింగ్, అనామోలీస్ ఓటర్లకు త్వరితగతిన నోటీసులు జారీ చేయాలి

**హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సమీక్ష**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి)**

ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్, అనామోలీస్ జాబితాల్లో ఉన్న ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు ఈఆర్ఓలు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు ఏఈఆర్ఓలు తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, నో మ్యాపింగ్, అనామోలీస్ జాబితాల్లో ఉన్న ఓటర్లకు నోటీసులు త్వరితగతిన జారీ చేయడంతో పాటు, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన పత్రాల ఆధారంగా ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. సంబంధిత అధికారులు హియరింగ్‌లను నిర్ణీత కార్యాచరణ ప్రకారం నిర్వహించి, పరిశీలన అనంతరం సరైన మరియు సంబంధిత పత్రాలను మాత్రమే పోర్టల్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జిల్లా ఎన్నికల అధికారులు తమ లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న అంశాలను వెంటనే పరిశీలించి క్లియర్ చేయాలని సూచించిన ఆయన, జిల్లా స్థాయిలో మరియు ఈఆర్ఓ కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఓటర్లకు నోటీసులు అందించిన వెంటనే, సమర్పించాల్సిన పత్రాలు, తదుపరి చేపట్టాల్సిన ప్రక్రియపై స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు దాదాపు 60 శాతం నోటీసుల జారీ ప్రక్రియ పూర్తయిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. మిగిలిన నోటీసులను కూడా త్వరితగతిన జారీ చేసి ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు.

హియరింగ్‌లను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్నామని, ఓటర్లు సరైన పత్రాలను సమర్పించేలా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నో మ్యాపింగ్, అనామోలీస్‌కు సంబంధించిన ప్రక్రియను సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేసేలా సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.




# కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలు చేయాలి

- **బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి**
- **మునగాల ప్రజావాణిలో ఎంపీడీవోకు బీఆర్ఎస్ వినతి**

**మునగాల, సెప్టెంబర్ 7 (వుదయం):**



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలని డిమాండ్ చేస్తూ మునగాల బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500, రైతులకు ఎకరాకు రూ.15,000 రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12,000, వరికి క్వింటాల్‌కు రూ.500 బోనస్, నిరుద్యోగ భృతి, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, ఆసరా పెన్షన్ల పెంపు, రూ.2 లక్షల పంట రుణమాఫీ తదితర హామీలను ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రైతుబంధు, రైతుబీమా, ఆసరా పెన్షన్లు, కంటి వెలుగు, గొర్రెల పంపిణీ, దళితబంధు, బీసీ బంధు తదితర సంక్షేమ కార్యక్రమాలను నిలిపివేయకుండా పునరుద్ధరించాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ప్రజల తరఫున మరింత బలమైన ఉద్యమాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు, కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మునగాల మండల పార్టీ అధ్యక్షుడు తొగరు రమేష్, సీనియర్ నాయకులు సుంకర అజయ్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్లు కందిబండ సత్యనారాయణ, రామిరెడ్డి, సర్పంచులు రాంపంగ సుందర్, బూసి వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ కోలా ఉపేంద్రరావు పాల్గొన్నారు. అలాగే గ్రామ శాఖ అధ్యక్షులు ఉడుం కృష్ణ, ఆదిరెడ్డి, గోవిందరెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకన్న, బొమ్మ చిన్న వెంకన్న, సీనియర్ నాయకులు ప్రదీప్ సార్, సైదా, మణికంఠ, దొంగరి శ్రీనివాస్, సైదులు, లక్ష్మయ్య, నరసయ్య, ఆంజనేయులు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

**చలో ఇందిరాపార్క్‌కు వెళ్తున్న బీజేపీ నేతల ముందస్తు అరెస్ట్**

**మునగాల, సెప్టెంబర్ 7 (వుదయం):**



ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 40 లక్షల మంది విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపిస్తూ భారతీయ జనతా పార్టీ యువమోర్చా ఇచ్చిన పిలుపు మేరకు చలో ఇందిరాపార్క్ కార్యక్రమానికి వెళ్తున్న బీజేపీ నాయకులను మునగాలలో పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మునగాల మండల అధ్యక్షుడు మైలారిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడటం సరికాదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదు.. విద్యార్థుల కోసం నిరంతరం పోరాడుతాం అని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసే వరకు విద్యార్థుల పక్షాన బీజేపీ పోరాటాన్ని కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు రాణబోతు శ్రీనివాస్‌రెడ్డి, బేతంకపల్లి రెడ్డి, వినోద్, ప్రధాన కార్యదర్శి పనస రమేష్, రెడ్డిపల్లి సైదులు, సీహెచ్ గోవిందాచారి, పీవీ పవన్‌కుమార్, ఎస్. వెంకట్‌రెడ్డి తదితరులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు.



## భూగర్భ జలాల పరిరక్షణకు ఇంకుడు గుంతలు

**సర్పంచ్ కంపాటి వెంకటేశ్వర్లు**

**మునగాల, సెప్టెంబర్ 7 (వుదయం):**

వర్షపు నీటిని వృథా కాకుండా ఒడిసిపట్టి భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సర్పంచ్ కంపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షాకాలంలో కురిసే ప్రతి చుక్క నీటిని సంరక్షించి భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలమట్టం పెరగడంతో పాటు బోర్లు, బావుల్లో నీటి లభ్యత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటి పరిసరాల్లో, ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, ఇతర అవసరమైన ప్రదేశాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంపాటి వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**విఓ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ప్రజావాణిలో వినతి**

**చర్ల, సెప్టెంబర్ 7: (వుదయం ప్రతినిధి)**




ఆర్.కొత్తగూడెం గ్రామపంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మండలంలోనే ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని సర్పంచ్ తుర్రం రవికుమార్ తెలిపారు. సోమవారం చర్ల మండల ప్రజావాణి కార్యక్రమంలో ఉపసర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, రుంజా రాజాతో కలిసి మండల నోడల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. గ్రామ సమాఖ్య సంఘాల డ్వాక్రా భవన నిర్మాణానికి స్థలం లేక మహిళా సంఘాలు ఇబ్బందులు పడుతున్నందున, గ్రామంలో ఉన్న ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఎంపీ బలరాం నాయక్ సహకారంతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రహదారులు, డ్రైనేజీలు, వీధిలైట్లు, విద్యుత్ స్తంభాలు, ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి హామీ పనులు చేపట్టామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మూగజీవాలపై క్రూరత్వాన్ని అరికట్టాలి

**భద్రాచలం డీఎస్పీకి బీజేపీ ప్రతినిధుల వినతి**

**భద్రాచలం, 7/9/26 వుదయం ప్రతినిధి**




భద్రాచలం పరిసర ప్రాంతాల్లో ఎద్దులు, ఆవులతో ఇసుక బండ్లు లాగిస్తూ వాటిపై అధిక బరువులు మోయించడం, విశ్రాంతి లేకుండా పదేపదే తిప్పడం, అలసిపోయిన మూగజీవాలను కొట్టడం వంటి క్రూరమైన చర్యలను వెంటనే అరికట్టాలని కోరుతూ బీజేపీ భద్రాచలం బృందం భద్రాచలం డీఎస్పీ, ఎస్డీపీఓ శ్రీ ఎం. అరుణ్ కుమార్ గారిని కలిసి వినతిపత్రం అందజేసింది. గోదావరి ఇసుక ర్యాంపుల నుంచి భద్రాచలం పట్టణం వైపు ఎద్దుల బండ్ల ద్వారా ఇసుకను తరలిస్తున్న సమయంలో మూగజీవాలపై జరుగుతున్న క్రూరత్వంపై అధికారులు తక్షణమే విచారణ చేపట్టాలని బీజేపీ నాయకులు కోరారు. పశువుల సామర్థ్యానికి మించి అధిక బరువులు మోయించడం, గంటల తరబడి విశ్రాంతి లేకుండా పని చేయించడం, అలసిపోయిన జంతువులను కొట్టి బలవంతంగా నడిపించడం వంటి ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పశువులతో పని చేయించడం సంప్రదాయంలో భాగమే అయినప్పటికీ, వాటి ఆరోగ్యం మరియు సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకోకుండా అధిక బరువులు మోయించడం, విశ్రాంతి లేకుండా నిరంతరం నడిపించడం, కొట్టడం వంటి చర్యలు మాత్రం తీవ్ర క్రూరత్వానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు, పశువులపై జరుగుతున్న దోపిడీకి కారణాలేమిటనే అంశాలపై అధికారులు సమగ్రంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి పవిత్ర క్షేత్రమని, గోమాతను పూజించే భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో మూగజీవాలకు ప్రత్యేక స్థానం ఉందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. అలాంటి పవిత్ర ప్రాంతంలో మూగజీవాలపై ఎలాంటి క్రూరత్వానికి తావులేకుండా సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మూగజీవాలు తమ బాధను మాటల్లో చెప్పుకోలేవని, అందువల్ల వాటి సంరక్షణ బాధ్యత సమాజంతో పాటు అధికారులపై కూడా ఉందని బీజేపీ బృందం స్పష్టం చేసింది. ఇకపై ఇసుక రవాణా సమయంలో పశువులను హింసించే ఘటనలు పునరావృతం కాకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఎస్పీకి వినతిపత్రం ద్వారా కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సంతోష్, బీజేపీ నాయకులు కుంజా ధర్మా, నిడదవోలు నాగబాబు, ముత్యాల చంద్రశేఖర్, గంగులకుర్తి రామాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే బర్తరఫ్ చేయాలి

**చర్ల, సెప్టెంబర్ 7: (వుదయం ప్రతినిధి)**



అసెంబ్లీ స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత, అవమానకర వ్యాఖ్యలను చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ నాయుడు తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను కించపరిచే విధంగా మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత గౌరవప్రదమైన పదవుల్లో అసెంబ్లీ స్పీకర్ పదవి ఒకటని, ఆ పదవి గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందన్నారు. తాతా మధు వ్యాఖ్యలు బీఆర్ఎస్ నాయకుల అహంకారానికి, బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విజయ్ నాయుడు విమర్శించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి, ఎమ్మెల్సీ తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వెంటనే బర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్తులో రాజ్యాంగబద్ధమైన పదవులపై ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాప్రతినిధులు ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ హుందాతనంతో వ్యవహరించాలని విజయ్ నాయుడు సూచించారు.

# ఇంటిని తలపిస్తున్న సీతారాం నగర్ కాలనీ ప్రాథమిక పాఠశాల

**బెక్కంటి శ్రీనివాస్ రావు మండల విద్యాశాఖ అధికారి**

**భద్రాచలం, సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి):**



సీతారాం నగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో తరగతి గదులు, పాఠశాల ప్రాంగణం, మరుగుదొడ్ల నిర్వహణను ఒక్కసారి పరిశీలిస్తే పరిశుభ్రమైన ఇంటి వాతావరణాన్ని తలపిస్తుందని మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాస రావు అన్నారు. సోమవారం పాఠశాలల సందర్శన కార్యక్రమంలో భాగంగా ఆయన ఆకస్మికంగా సీతారాం నగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన ప్రార్థన కార్యక్రమంలో పాల్గొని వారితో మమేకమయ్యారు. అనంతరం పాఠశాలలోని వివిధ తరగతి గదులు, విద్యార్థులకు అందుతున్న బోధన, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్వహణ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన విద్యా వాతావరణాన్ని కల్పిస్తున్న తీరు అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రతి తరగతి గదిని క్రమబద్ధంగా నిర్వహిస్తూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు స్థానిక దాత డి. సుబ్బరాజు వితరణ చేసిన ప్లేట్లు, గ్లాసులు, గిన్నెల పంపిణీ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు. దాత అందించిన వస్తువులను విద్యార్థులకు స్వయంగా అందజేసి, చిన్నారులతో మాట్లాడారు. సీతారాం నగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో నెలకొల్పిన పరిశుభ్రమైన వాతావరణం ఇతర ప్రభుత్వ పాఠశాలలకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు అవసరమైన వస్తువులను అందించిన దాత డి. సుబ్బరాజును మండల విద్యాశాఖ అధికారి అభినందించారు. భవిష్యత్తులో కూడా పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం కోసం మరింత మంది దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. రామకృష్ణ, కే. కరుణ కుమార్, బహుమతి వితరణ దాత డి. సుబ్బరాజు, తెలంగాణ అన్ని పెన్షనర్స్ మరియు రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ (TAPRPA) అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు, కేఎస్ఎల్వీ ప్రసాద్, రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జి. భూషణరావు, దామోదర్ రావు, పాఠశాల స్వచ్ఛ మిత్ర సేవకుడు జి. దిలీప్ కుమార్, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు పి. మౌనికతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భద్రాచలం దేవస్థానానికి భారీ విరాళం

- **అన్నదానానికి రూ.3 లక్షలు**
- **గోశాల నిర్వహణకు రూ.2 లక్షలు**

**భద్రాచలం, సెప్టెంబర్ 7 (వుదయం ప్రతినిధి):**



ప్రపంచ ప్రసిద్ధి గాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానానికి భక్తులు తమ భక్తి శ్రద్ధలను చాటుకుంటూ వివిధ రూపాల్లో విరాళాలు అందజేస్తుంటారు. స్వామివారి సేవలో భాగస్వాములు కావాలనే పవిత్ర సంకల్పంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భద్రాద్రికి చేరుకుని తమ మొక్కులు తీర్చుకుంటూ, దేవస్థాన అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తున్నారు. ఈ క్రమంలో భీమవరం వాస్తవ్యులు, ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన శ్రీ చింతలపాటి సీతమ్మ గారు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి భారీ విరాళాన్ని అందజేశారు. స్వామివారిపై అపారమైన భక్తి విశ్వాసాలతో శ్రీ చింతలపాటి సీతమ్మ గారు దేవస్థానంలో నిర్వహిస్తున్న పవిత్రమైన అన్నదాన కార్యక్రమానికి రూ.3,00,000 (మూడు లక్షల రూపాయలు) విరాళంగా అందించారు. అదేవిధంగా గోమాతల సంరక్షణ, పోషణ, నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన గోశాలకు రూ.2,00,000 (రెండు లక్షల రూపాయలు) విరాళంగా సమర్పించారు. ఈ విధంగా అన్నదానం మరియు గోసేవ అనే రెండు పవిత్రమైన సేవా కార్యక్రమాలకు కలిపి మొత్తం రూ.5,00,000 (ఐదు లక్షల రూపాయలు) విరాళంగా అందించడం విశేషంగా నిలిచింది. శ్రీ చింతలపాటి సీతమ్మ గారు అందించిన ఈ విరాళాన్ని ఈఈ రవీందర్ గారి ద్వారా దేవస్థానం ఈఓ గారికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా స్వామివారి సేవా కార్యక్రమాలకు సహకరిస్తూ ఉదారంగా విరాళం అందించిన శ్రీ చింతలపాటి సీతమ్మ గారిని దేవస్థాన అధికారులు, భక్తులు అభినందించారు. గోసేవ ద్వారా సమాజంలో సేవాభావం పెంపొందుతుందని, భవిష్యత్ తరాలకు భారతీయ సంప్రదాయాలు, సనాతన ధర్మ విలువలు తెలియజేయవచ్చని భక్తులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో భీమవరం వాస్తవ్యులు, ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన శ్రీ చింతలపాటి సీతమ్మ గారు అందించిన ఐదు లక్షల రూపాయల భారీ విరాళం భక్తి, సేవా భావాలకు ప్రతీకగా నిలిచిందని పలువురు కొనియాడారు. భద్రాద్రి రామయ్య సేవలో అన్నదానానికి చేయూతనిస్తూ, గోమాత సేవకు అండగా నిలుస్తూ భక్తి శ్రద్ధలతో రూ.5 లక్షల భారీ విరాళం అందించిన శ్రీ చింతలపాటి సీతమ్మ గారి ఈ ఉదార సేవా కార్యక్రమం పలువురికి ఆదర్శంగా నిలవాలని, మరింత మంది భక్తులు కూడా దేవస్థాన సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందించాలని పలువురు కోరారు.



## చందా లక్ష్మమ్మ వర్ధంతి సందర్భంగా వృద్ధులకు పండ్ల పంపిణీ

**మునగాల, సెప్టెంబర్ 7 (వుదయం):**

బీసీ యువజన సంఘం జాతీయ కార్యదర్శి చందా సైదాబాబు తల్లి చందా లక్ష్మమ్మ వర్ధంతి సందర్భంగా సోమవారం ముకుందాపురం లోని ఇందిరా అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులు, అనాథలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ పాల్గొని వృద్ధులకు పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందా లక్ష్మమ్మ ఆశయాలను కొనసాగిస్తూ భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇందిరా అనాథ వృద్ధాశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ, బీసీ యువజన సంఘం మండల అధ్యక్షుడు బాలబోయిన నగేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి సాంకేతికంగా ముందడుగు

- **ప్రతిపాదిత స్థలాలను పరిశీలించిన ఏఏఐ మల్టీ డిసిప్లినరీ బృందం**
- **రన్‌వే, నైట్ ల్యాండింగ్, అప్రోచ్ ఫన్నెల్‌పై క్షేత్రస్థాయి అధ్యయనం**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి)**



జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి కీలక ముందడుగు పడింది. విమానాశ్రయ ఏర్పాటుకు గుర్తించిన ప్రతిపాదిత స్థలాల సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) మల్టీ డిసిప్లినరీ సాంకేతిక బృందం రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం జిల్లాకు చేరుకుంది. తొలి రోజు పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. ఏఏఐ సభ్యులు భరత్‌రెడ్డి, ఎండీ ఏవియేషన్ నేతృత్వంలోని సాంకేతిక బృందం ప్రతిపాదిత ప్రాంతాల్లో భూమి లభ్యత, విస్తీర్ణం, భౌగోళిక పరిస్థితులు, రన్‌వే నిర్మాణానికి అనుకూలత, విమానాల అప్రోచ్ ఫన్నెల్, నైట్ ల్యాండింగ్, భద్రతా ప్రమాణాలు తదితర అంశాలను పరిశీలించింది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసే అవకాశాలను కూడా బృందం అధ్యయనం చేస్తోంది. జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సుజాతానగర్ మండలంలోని సీతంపేట, సుజాతానగర్, దుమ్ముగూడెం మండలంలోని దుమ్ముగూడెం, ములకలపల్లి మండలంలోని చాపరాలపల్లి, దమ్మపేట మండలంలోని పాల్వంచ/దమ్మపేట, చుంచుపల్లి మండలంలోని పెనగడప ప్రాంతాలను ప్రతిపాదిత స్థలాలుగా గుర్తించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయా ప్రాంతాల్లో స్థల పరిశీలన, సర్వే, సాంకేతిక అధ్యయనం కొనసాగుతోంది.

**ఎంపీ, కలెక్టర్‌తో ఏఏఐ బృందం సమావేశం**

సింగరేణి గెస్ట్‌హౌస్‌లో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో ఏఏఐ సాంకేతిక బృందం సమావేశమైంది. ప్రతిపాదిత విమానాశ్రయానికి సంబంధించిన వివిధ అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఏ టి ఆర్–72 తరహా విమానాలతో పాటు భవిష్యత్‌లో ఎయిర్‌బస్ ఎ320/ఎ321 వంటి పెద్ద విమానాల రాకపోకలకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేసే అంశాలపై చర్చ జరిగింది. పెద్ద విమానాల రాకపోకలకు అనుగుణంగా సుమారు 2,500 నుంచి 2,700 మీటర్ల రన్‌వే అవసరమయ్యే అవకాశాలను సాంకేతిక బృందం పరిశీలిస్తోంది. రన్‌వేకు అవసరమైన భూమి, భవిష్యత్ విస్తరణకు ఉన్న అవకాశాలు, నైట్ ల్యాండింగ్‌కు అవసరమైన సదుపాయాలు, భద్రతా ప్రమాణాలు తదితర అంశాలను కూడా అధ్యయనం చేస్తున్నారు.

**రైల్వే లైన్‌పై ప్రత్యేక పరిశీలన**

ప్రతిపాదిత ప్రాంతానికి సమీపంలో ఉన్న విద్యుదీకరించిన బొగ్గు రవాణా రైల్వే లైన్ కూడా ఏఏఐ బృందం పరిశీలనలో కీలక అంశంగా మారింది. రైల్వే మార్గం విమానాల అప్రోచ్ ఫన్నెల్ పరిధిలోకి వచ్చే అవకాశాల నేపథ్యంలో దాని వల్ల కలిగే సాంకేతిక ప్రభావాలను అధికారులు పరిశీలిస్తున్నారు. అవసరమైతే 'షీల్డింగ్' ప్రక్రియ ద్వారా సాంకేతిక అవరోధాన్ని అధిగమించే అవకాశాలను పరిశీలించడంతో పాటు, రైల్వే శాఖ నుంచి అవసరమైన ఎన్‌ఓసీ పొందే అంశాన్ని కూడా పరిశీలించనున్నారు. సర్వే నంబర్లు, భూమి విస్తీర్ణం, రెవెన్యూ మ్యాపులు, భౌగోళిక కోఆర్డినేట్లు, స్థల హద్దులు, అప్రోచ్ రోడ్లు, రెవెన్యూ, సాంకేతిక రికార్డులను సంబంధిత అధికారులు ఏఏఐ బృందానికి అందుబాటులో ఉంచారు. క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలను రికార్డులతో సరిపోల్చుకుంటూ బృందం సాంకేతిక అధ్యయనం నిర్వహిస్తోంది.

**జిల్లా అభివృద్ధికి దోహదం: ఎంపీ**

ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు జిల్లా అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. విమానాశ్రయం అందుబాటులోకి వస్తే పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాల అభివృద్ధికి ఊతం లభించడంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

**ఏఏఐ అధ్యయనానికి పూర్తి సహకారం: కలెక్టర్**

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి ఏఏఐ సాంకేతిక బృందం నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి పరిశీలనకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. అవసరమైన రెవెన్యూ, సర్వే, సాంకేతిక సమాచారాన్ని సిద్ధంగా ఉంచి, పరిశీలన సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా తొలి రోజు ప్రతిపాదిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించిన ఏఏఐ బృందం, రెండో రోజు కూడా షెడ్యూల్ ప్రకారం మిగిలిన ప్రాంతాలు, సాంకేతిక అంశాలను పరిశీలించనుంది. మొత్తం పరిశీలన అనంతరం టెక్నికల్ ఫీజిబిలిటీ స్టడీ నిర్వహించి, విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించిన సాంకేతిక సాధ్యాసాధ్యాలపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు. ఈ పర్యటనలో సంబంధిత రెవెన్యూ, సర్వే, ఇంజినీరింగ్, ఇతర శాఖల అధికారులు, ఏఏఐ సాంకేతిక ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉద్యోగ హక్కుల సాధనకై సెప్టెంబర్ 10న హైదరాబాద్ లో భారీ సభ

**అనంతగిరిలో గోడ ప్రచార పత్రం ఆవిష్కరణ**

**అనంతగిరి సెప్టెంబర్ 07 వుదయం**



సెప్టెంబర్ 10న హైదరాబాద్ నందు జరగనున్న ఉద్యోగుల సాధన హక్కుల సభను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ అనంతగిరిలో టీఎన్జీవో నాయకులు చలో హైదరాబాద్ గోడ ప్రచార పత్రాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎన్జీవో కోదాడ ప్రధాన కార్యదర్శి పొలంపల్లి వెంకట నగేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం,పెండింగ్ లో ఉన్న డీఏలు,పీఆర్సీ,ఉద్యోగుల బదిలీలు,పదోన్నతులు,ఆరోగ్య భద్రత కార్డుల అమలు తదితర న్యాయమైన డిమాండ్ల సాధన కోసమే సెప్టెంబర్ 10న హైదరాబాద్ లో సాధన హక్కుల సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పింఛనుదారులు అందరూ కుటుంబ సమేతంగా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఉద్యోగుల ఐక్యతను చాటి చెప్పేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, ప్రభుత్వం తమ న్యాయమైన కోర్కెలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో నాయకులు కోశాధికారి మట్టపల్లి మహేష్,ప్రసాద్,గంటే పొంగు విక్రమ్,లక్ష్మారెడ్డి,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తాతా మధు అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

**దమ్మపేట సెప్టెంబర్ 7 (వుదయం ప్రతినిధి):**



దమ్మపేట: అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను దమ్మపేట మండల కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు, రాజకీయ సంస్కృతికి విరుద్ధంగా ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో దమ్మపేట మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కక్కిరాల రమేష్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా మాట్లాడాల్సిన ప్రజాప్రతినిధులు వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలకు పాల్పడటం సరి కాదన్నారు. రాజకీయ భేదాలు ఉన్నప్పటికీ పరస్పర గౌరవం, హుందాతనం, ప్రజాస్వామ్య సంప్రదాయాలను ప్రతి నాయకుడు పాటించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేయాలనుకుంటే విధానాలపై మాట్లాడాలని, వ్యక్తిగతంగా అవమానించే విధంగా వ్యాఖ్యలు చేయడం తగదని కాంగ్రెస్ నాయకులు హితవు పలికారు. తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

# మార్కెట్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

**మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి**

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 7 (వుదయం ప్రతినిధి):**

రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు మార్కెట్ యార్డులో మౌలిక వసతులను అభివృద్ధి చేసి, రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. సోమవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన పాలకవర్గ సమావేశంలో మార్కెట్ సమస్యలు, పరిష్కార చర్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా గత పాలకవర్గ సమావేశంలో తీసుకున్న తీర్మానాలను చదివి వినిపించి, వాటి అమలుపై సభ్యులతో చర్చించారు. ఇటీవల మృతి చెందిన మార్కెట్ కమిటీ డైరెక్టర్ కురిసంఘు మోతిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, సంతాపం తెలిపారు. చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. 2026–27 సంవత్సరానికి మార్కెట్ యార్డులోని ఎలక్ట్రిక్ వే బ్రిడ్జి మరమ్మతుల కోసం సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. టెండర్ ఫారాలను సెప్టెంబర్ 7 నుంచి 15వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మార్కెట్ కార్యాలయంలో పొందవచ్చన్నారు. పూర్తి చేసిన సీల్డ్ టెండర్లను సెప్టెంబర్ 16న మధ్యాహ్నం 2 గంటల వరకు సమర్పించాలని సూచించారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు టెండర్లు తెరవనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు, నిబంధనల కోసం మార్కెట్ కమిటీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

**రైతులకు మరిన్ని సౌకర్యాలు**

మార్కెట్ యార్డు అభివృద్ధిలో భాగంగా త్వరలో కాంపౌండ్ వాల్, సోలార్ ఫెన్సింగ్, సీసీ కెమెరాలు, ఆర్వో వాటర్ ప్లాంట్, మార్కెట్ యార్డు క్లీనింగ్, మాయిశ్చర్ మీటర్లు, 200 తాడిపత్రులు ఏర్పాటు చేయనున్నట్లు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మార్కెట్‌లో మౌలిక వసతులను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష సతీష్, మార్కెట్ సెలెక్షన్ గ్రేడ్ కార్యదర్శి విట్టల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తన్వీర్ అహ్మద్, పీఏసీ చైర్మన్ మేస్త్రం పరమేశ్వర్, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# దళితుల జోలికి వస్తే సహించేది లేదు

**టిపిసిసి ఎస్సీ విభాగం వైస్ చైర్మన్ రాజభద్రయ్య**

**హసన్ పర్తి సెప్టెంబర్7 (వుదయం ప్రతినిధి):**



తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై ఎమ్మెల్సీ తాత మధు చేసిన వ్యాఖ్యల పై టీపీసీసీ ఎస్సీ విభాగం వైస్ చైర్మన్ బందెల రాజభద్రయ్య తీవ్రంగా ఖండిస్తూ దళితుల జోలికి వస్తే సహించేది లేదని అన్నారు. సోమవారం తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా రాజభద్రయ్య మాట్లాడుతూ.. దళితులంటే ఎమ్మెల్సీ తాతా మధుకు ఎందుకంత చులకన అని, పదవిలో ఉన్నామనే అహంకారంతో మాట్లాడటం సరి కాదన్నారు. దళిత సమాజాన్ని అవమానించే విధంగా ఎవరైనా మాట్లాడితే ప్రజాస్వామ్య పద్ధతిలో తీవ్రంగా వ్యతిరేకిస్తామని అన్నారు. దళితులు, బహుజనుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు పునరావృతం చేయవద్దని హెచ్చరించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం ప్రతిపౌరుడికి సమాన గౌరవం కల్పించిందని, ఆ రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు.ఇకనైనా తాతా మధు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని రాజభద్రయ్య డిమాండ్ చేశారు. దళితుల ఆత్మ గౌరవానికి భంగం కలిగించే ఎలాంటి వ్యాఖ్యలను సహించబోమని, అవసరమైతే ప్రజాస్వామ్య బద్ధంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని రాజభద్రయ్య స్పష్టం చేశారు.

# మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు

- **జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు జీవితాన్ని అంకితం చేశారు**
- **టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్**

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, (వుదయం ప్రతినిధి), సెప్టెంబర్ 7:**

తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్, మాజీ ఐజేయూ జాతీయ అధ్యక్షుడు కే. శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే–ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే నాయకులు, జర్నలిస్టులు కేక్ కట్ చేసి శ్రీనివాస్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం శ్రీనివాస్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నిర్వహించి, వారి హక్కుల పరిరక్షణకు తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు.



జర్నలిస్టుల సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొంటూ, శ్రీనివాస్ రెడ్డి ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు ప్రకాష్ గౌడ్, టీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు నగరారే తారు, దేవనూరి రమేష్, ప్రెస్ క్లబ్ కోశాధికారి శ్రీధర్, జర్నలిస్టులు మేకల శ్రీనివాస్, సురేష్ చారి, అబ్దుల్ హన్నన్, రాధాకృష్ణ చారి, సయ్యద్ సోజర్, భాస్కరాచారి, అబ్దుల్ గఫ్ఫార్, సయ్యద్ షౌకత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**కలెక్టర్ కె. హరిత**

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, (వుదయం ప్రతినిధి), సెప్టెంబర్ 7:**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR)లో భాగంగా హియరింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తూ, నోటీసుల జారీని వేగవంతం చేయాలని ప్రత్యేక సమగ్ర సవరణ పరిశీలకురాలు డా. యోగితా రాణా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ కె. హరిత, అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ తదితర అధికారులతో కలిసి తహసిల్దార్లతో హియరింగ్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. మ్యాపింగ్ కాని, అన మలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు త్వరగా నోటీసులు అందించి, 100 శాతం హియరింగ్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన ధ్రువపత్రాలను అదే రోజు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కలెక్టర్ కె. హరిత మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో హియరింగ్ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. రాజకీయ పార్టీల సహకారంతో SIR ప్రక్రియను పూర్తి చేస్తున్నామని పేర్కొన్నారు.

# గర్భిణీ స్త్రీలకు పూలు పండ్లు బట్టల పంపిణీ

**గ్రామ సర్పంచ్ లకావత్ వసంతప్రవీణ్**

**ఖానాపురం, సెప్టెంబర్ 7 (వుదయం ప్రతినిధి):**

మండలంలోని కొర్తిమాటుతండ గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడి సెంటర్ లోని పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు గ్రామ సర్పంచ్ లకావత్ వసంత ప్రవీణ్ పూలు పండ్లు బట్టలను పెట్టి ఘనంగా శ్రీమంతాలను నిర్వహించినట్లు అంగన్వాడి టీచర్ మరియ తెలిపారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు బాలింతలకు పౌష్టికాహారంపై సర్పంచ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జాటోత్ శారద, బుజ్జమ్మ, బి శారద, అంగన్వాడి ఆయా భారతి, ఆశా కార్యకర్త, గర్భిణీ స్త్రీలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



# భూగర్భ జలాలను పెంచడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

- **ఫారం ఫండ్ నిర్మాణానికి భూమి పూజ**
- **సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు వెంకన్న**

**ఖానాపురం, సెప్టెంబర్ 7 (వుదయం ప్రతినిధి):**

భూగర్భ జలాలను పెంచడమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని గ్రామ సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు మాడ్రాజ్ వెంకన్న గ్రామ ప్రజలకు తెలిపారు. మండలంలోని ధర్మరావుపేట గ్రామంలోని సర్పంచ్ తన సొంత భూమిలో వీబీజీ రామ్ జీ పథకంలో భాగంగా పారం ఫండ్ ను పథకమును పనులకు గ్రామ సర్పంచ్ కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృశ్య భూగర్భ జలాలు అడుగంటుతున్న తరుణంలో ఈ పథకం ద్వారా వర్షపు నీరును నిల్వ చేయుటకు భూగర్భ జలాలను పెంచడానికి ఈ పథకం ఎంతగానో ప్రజలకు రైతులకు ఉపయోగపడుతుందని గ్రామ ప్రజలకు రైతులకు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.



# మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో మద్యం విక్రయించరాదు

**ఏసీపీ ఆర్. ప్రకాష్**

**జన్నారం,సెప్టెంబర్ 7(వుదయం విలేకరి)**

మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం విక్రయించరాదని మంచిర్యాల ఎ సి పి ఆర్. ప్రకాశ్ అన్నారు.జన్నారం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ లో మంచిర్యాల ఎసిపి ఆర్. ప్రకాశ్,లక్షెట్టి పేట్ సిఐ డి.రమణమూర్తి ఆధ్వర్యంలో లిక్కర్ షాప్ యజమానులు, అలాగే లైసెన్స్ దారులతో సమావేశం నిర్వహించి మద్యం విక్రయాల విషయంలో తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలపై పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం విక్రయించరాదని, వయస్సుపై అనుమానం ఉన్న సందర్భంలో వయస్సు ధృవీకరించిన తర్వాత మాత్రమే మద్యం విక్రయించాలని సూచించారు. అలాగే ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి లిక్కర్ షాప్‌లను తప్పనిసరిగా మూసివేయాలని,నిర్ణీత సమయం దాటిన తర్వాత ఎలాంటి మద్యం విక్రయాలు చేయరాదని స్పష్టం చేశారు. ఒకే వ్యక్తికి అధిక పరిమాణంలో మద్యం విక్రయించకుండా, అనుమానాస్పదంగా పెద్ద మొత్తంలో మద్యం కొనుగోలు చేసే వ్యక్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి లిక్కర్ షాప్‌లో సిసి టీవి కెమెరాలను ఏర్పాటు చేసి,అవి నిరంతరం పనిచేసేలా చూడాలని,సీసీ టీవీ ఫుటేజ్‌ను నిబంధనల ప్రకారం భద్రపరచాలని సూచించారు.లిక్కర్ షాప్‌ల వద్ద ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు,గొడవలు లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు తావులేకుండా చూడాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించినట్లయితే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జన్నారం,దండేపల్లి ఎస్సె లు జి.ఉదయ్ కిరణ్,జి.రాజ వర్ధన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





# డీజే నిర్వాహకుల బైండోవర్

**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 7 (వుదయం న్యూస్):**

గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లక్షెట్టిపేటకు చెందిన పలువురు డీజే నిర్వాహకులను తహసిల్దార్ దిలీప్ కుమార్ ముందు బైండోవర్ చేసినట్లు ఎస్ఐ గోపతి సురేష్ సోమవారం తెలిపారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా వినాయక మండపాల వద్ద ఎలాంటి డీజేలకు అనుమతి లేదని శోభాయాత్రలో కూడా డీజేలు పెట్టకూడదని భక్తి శ్రద్ధలతో శాంతియుత వాతావరణం లో గణేష్ పండుగను జరుపుకోవాలని సూచించారు. గణేష్ మండప నిర్వాహకులు పోలీస్ పోర్టల్ లో పూర్తి వివరాలు పొందుపరచాలన్నారు. మండపాల వద్ద సినిమా పాటలు పెట్టడం, జూదం ఆడటం లాంటివి చేయకూడదని ముఖ్యంగా భారీ సౌండ్ వచ్చే బాక్స్ ఎట్టి పరిస్థితుల్లో పెట్టకూడదని పోలీసులు సూచించారు. డీజే నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘించి డీజేలు పెట్టిన శోభాయాత్రలు డీజేలు పెట్టిన శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

# బీఆర్ఎస్‌కు బిగ్ షాక్.. కాంగ్రెస్‌లోకి మాజీ ఎంపీపీ

**గుడిహత్నూర్‌లో కాంగ్రెస్‌కు బలం.. డా. నరేష్ జాదవ్**

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 7 (వుదయం ప్రతినిధి):**

గుడిహత్నూర్ మండలంలో బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. మండల మాజీ ఎంపీపీ కేంద్రే జ్ఞానోబా కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం హైదరాబాద్‌లో ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్ ఆధ్వర్యంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కేంద్రే జ్ఞానోబాకు కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆయన చేరికతో గుడిహత్నూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కానుందని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. ప్రజల విశ్వాసానికి అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తోందని, రానున్న రోజుల్లో ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బోథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రఫుల్ రెడ్డి, గుడిహత్నూర్ మాజీ మండల అధ్యక్షుడు అంకత్ రవి, ఇచ్చోడ మాజీ అధ్యక్షుడు కుంట ప్రవీణ్ రెడ్డి, నేరడిగొండ మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్, రాజుగౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.



# స్పీకర్ గడ్డం ప్రసాద్ ను దూషించిన ఘటనపై జాతీయ రహదారిపై నిరసన దిష్టిబొమ్మ దహనం

**ఖానాపురం, సెప్టెంబర్ 7 (వుదయం ప్రతినిధి):**

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాత మధు దూషించిన ఘటనపై మండల కేంద్రంలోని క్రింది బస్టాండ్ ఆవరణలోని ఎన్ హెచ్ 365 జాతీయ రహదారిపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన వ్యక్తం చేసి ఎమ్మెల్సీ దిష్టిబొమ్మను దగ్ధం చేసినట్లు నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్ పర్సన్ వల్లె శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఎస్.కె ముస్తఫా, మండల ప్రధాన కార్యదర్శి ఎస్కే లాల్ సాహెబ్, ఉపాధ్యక్షుడు మూడు పుల్ సింగ్, ఏఎంసీ డైరెక్టర్ గట్టి సారంగపాణి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు చెడిపాక ఉపేందర్, సర్పంచులు జాడి అచ్యుతం, బోడ రమేష్, ఉప సర్పంచ్ ఆరె సంపత్ కుమార్, వార్డు సభ్యులు శాఖమూరి ముకేశ్ చౌదరి, జాటోత్ బాలు, సొసైటీ పర్సన్ను దేవినేని వేణుగోపాల్ రావు, బొబ్బ విద్యాసాగర్ రావు, బ్లాక్ నాయకుడు గిరగానీ నరసయ్య, నాయకులు రెడ్డి నాగార్జునరెడ్డి, నాంచారి కుమారస్వామి, భూక్యా నరసింహతో పాటు బాధ్యులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు,



# నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు

**దండేపల్లి ఎస్ఐ రాజవర్ధన్**

**దండేపల్లి: సెప్టెంబర్ 07 (వుదయం విలేకరి)**



గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దండేపల్లి మండలంకు చెందిన పలువురు డిజె నిర్వాహకులను తహసీల్దార్ ముందు సోమవారం బైండోవర్ చేసినట్లు దండేపల్లి ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు ఈ సందర్భంగా ఎస్ఐ రాజవర్ధన్ మాట్లాడుతూ వినాయక మండపాల వద్ద ఎలాంటి డీజేలకు అనుమతి లేదని శోభాయాత్రలో కూడా డీజేలు పెట్టకూడదని భక్తి శ్రద్ధలతో శాంతియుత వాతావరణంలో గణేష్ పండుగను జరుపుకోవాలని సూచించారు.గణేష్ మండప నిర్వాహకులు పోలీస్ పోర్టల్ లో పూర్తి వివరాలు పొందుపరచాలన్నారు. డీజే నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘించి డీజేలు పెట్టిన శోభాయాత్రలు డీజేలు పెట్టిన శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

# విద్యార్థులకు స్వచ్ఛమైన నీరునందిస్తాం

**తొర్రూరు, సెప్టెంబర్ 7 (వుదయం ప్రతినిధి):**

ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు స్వచ్ఛమైన నీరునందిస్తామని నాంచారి మడూరు సర్పంచ్ బంగారు రమేష్ అన్నారు. గ్రామంలోని జయంతి కాలనీ ప్రాథమిక పాఠశాలలో కమ్యూనిటీ డెవలప్మెంట్ ఫౌండేషన్ సహకారంతో వాటర్ ప్లాంట్ ను ఎంఈఓ మహాకాళి బుచ్చయ్యతో కలిసి సర్పంచ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి స్వచ్ఛమైన నీరును అందించే ఉద్దేశంతో ఈ వాటర్ ప్లాంట్ లో ప్రారంభించడం జరిగిందని,ప్రతి విద్యార్థికి ఫౌండేషన్ తరపున వాటర్ బాటిల్ లను అందించడం అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి,ఉప సర్పంచ్ పనికిరా ఉపేంద్ర వెంకన్న, స్కూల్ హెచ్ఎం రవీందర్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి గా ఎన్నికైన నిజాముద్దీన్ కు ఘన సన్మానం

**దండేపల్లి: సెప్టెంబర్ 07 (వుదయం విలేకరి)**

లక్షెట్టిపేట సర్కిల్ ఎలాక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన నిజామొద్దీన్ ను మండలంలోని తాళ్ళపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం ఘనంగా శాలువాలతో సన్మానించి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ యంపిపి ఆకుల రాజేందర్,సర్పంచులు కుర్సెంగ కళావతి,జైనేని రాజవ్వ,ఉపసర్పంచులు పుట్టపాక తిరుపతి, మర్సుకోల్ల ప్రభాకర్,మాజీ సర్పంచ్ మర్సుకోల్ల లచ్చు పటేల్,నాయకులు మాడ దయాకర్,బట్టు రాజయ్య,జైనేని భీమయ్య,దావూద్ ఖాన్,పోడేటి లక్ష్మన్ గౌడ్,ఖాదర్,ఎర్రం మల్లేష్,మార్నేని పద్మ,భీమక్క,గొల్ల సత్తయ్య, ఇండ్ల నగేష్, లక్కాకుల రాజశేఖర్, సాదిక్,అనీఫ్,భూత రాజేందర్,అలిశెట్టి భాస్కర్, ఎర్రం రెడ్డి,తాజ్జుబాబా, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.





# ప్రజావాణి లో మూడు వినతులు

**దండేపల్లి: సెప్టెంబర్ 07 (వుదయం విలేకరి)**

దండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మూడు వినతులు వచ్చాయి లింగాపూర్ నుండి గుడిరేవు వెళ్ళే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని వెళ్ళడానికి చాలా అవస్థలు పడుతున్నామని మరమ్మత్తులు చేపట్టాలని గ్రామస్థులు వినతి పత్రం ఇచ్చారు మరియు తాళ్ళపేట గ్రామంలో విద్యుత్తు సరఫరా సరిగా లేదని సంబంధిత శాఖ అధికారులు సమస్య పరిష్కరించాలని తాళ్ళపేట ఉపసర్పంచ్ పుట్టపాక తిరుపతి, వార్డు సభ్యులు మ్యాడ దయాకర్ వినతి పత్రం ఇచ్చారు. రాజుగూడ నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించాలని కోరుతూ ప్రజావాణి లో వినతి పత్రం అందజేసారు సర్పంచ్ జైనేని రాజవ్వ భీమయ్య, ఉపసర్పంచ్ మర్సుకోల్ల ప్రభాకర్,వార్డు సభ్యులు తట్ర శంకర్,మార్నేని పద్మ, భీమక్క,అడాయి అనసూర్య మరియు గ్రామస్థులు మర్సుకోల్ల లచ్చు పటేల్,బట్టు రాజయ్య,అడాయి శంకర్, గడ్డం భీమయ్య, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు 'విద్య ప్లస్'



**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, (వుదయం ప్రతినిధి), సెప్టెంబర్ 7:**

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చడంతో పాటు విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు 'విద్య ప్లస్' పైలట్ ప్రాజెక్టును పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ తెలిపారు. ఎస్ఐఆర్–2026లో భాగంగా జిల్లాకు వచ్చిన ప్రత్యేక సమగ్ర సవరణ పరిశీలకురాలు డా. యోగితా రాణాకు 'విద్య ప్లస్'పై సమీక్షా నివేదికను సమర్పించారు. 5 నుంచి 10వ తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు సాంకేతికత, డిజిటల్ పరికరాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బోధనా విధానాలను వినియోగిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థుల అభ్యసన స్థాయి, ఉపాధ్యాయుల హాజరు, బోధనా కార్యక్రమాలను రియల్‌టైమ్ డాష్‌బోర్డ్ ద్వారా పర్యవేక్షించి అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకునేలా ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు.

# లక్ష బిల్వార్చనలో శ్రీకాంత్ రెడ్డి

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 7 (వుదయం ప్రతినిధి):**

ఆదిలాబాద్ పట్టణంలోని అంకోలి రోడ్డులో ఉన్న రాజరాజేశ్వర ఆలయంలో సోమవారం నిర్వహించిన లక్ష బిల్వార్చన కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సాదరంగా ఆహ్వానించగా, అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. లోకకల్యాణార్థం నిర్వహించిన లక్ష బిల్వార్చనలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని, రాజరాజేశ్వర స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. భక్తిశ్రద్ధలతో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

# భద్రత బందోబస్తుకు గణేష్ ఆన్లైన్ నమోదు విధానం

- **గణేష్ మండప నిర్వాహకులు పోలీసు శాఖ వారు రూపొందించిన పోర్టల్ ద్వారా వివరాలను నమోదు చేసుకుని పోలీసు వారికి సహకరించాలి...**
- **అప్లికేషన్ నమోదు చేయుటకు వాడవలసిన లింక్ http://policeportal.tspolice.gov.in/index.htm...**
- **జిల్లా సుపరేండెంట్ అశోక్ కుమార్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్**

**జగిత్యాల సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి)**

పోలీసు శాఖ వారు రూపొందించిన గణేష్ మండపం నిర్వహణకు సంబంధించిన ఆన్లైన్ ఇన్ఫర్మేషన్ అనేది కేవలం మండపం నిర్వహణ మండపం నకు సంబంధించిన సమాచారం కొరకు మాత్రమే రూపొందించిందని ఈ యొక్క సమాచారం ద్వారా భద్రత బందోబస్తు ఏర్పాటు చేయడానికి పోలీసులకు సులువుగా ఉంటుందని ఆన్ లైన్ ఇన్ఫర్మేషన్ కు ఎటువంటి రుసుము లేదని ఎస్పీ తెలిపారు గణేష్ ఉత్సవాల నిర్వాహకులు గణేష్ విగ్రహాలను వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేయుటకు ముందు ముందస్తు సమాచారం పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని అందుకోసం ఏదైనా కంప్యూటర్ మొబైల్ నందు అప్లై చేసుకోవాలని అన్నారు అందు కొరకు http://policeportal.tspolice.gov.in అనే site నందు వివరాలు పొందు పరచి అప్లికేషన్ ను సంబంధిత పోలీస్ స్టేషన్ నందు అందించాలని సూచించారు

**వినాయకుడి మండపాలు ఏర్పాటు చేసే వారికి జగిత్యాల జిల్లా పోలీసు వారి విజ్ఞప్తి**

భద్రత బందోబస్తు కొరకే గణేష్ ఆన్లైన్ నమోదు విధానం గణేష్ మండప నిర్వాహకులు పోలీసు శాఖ వారు రూపొందించిన పోర్టల్ ద్వారా వివరాలను నమోదు చేసుకుని పోలీసు వారికి సహకరించాలని గణేష్ మండపాలను ప్రజా రవాణాకు ఎమర్జెన్సీ వాహనాలు వెళ్లడానికి ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలని మండపాలు ఏర్పాటు చేసే వారు సంబంధిత శాఖల అనుమతి విద్యుత్ శాఖ వారి అనుమతి పత్రంతోనే విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని.మండపాలకు పూర్తి బాధ్యత మండపాల నిర్వాహకులదే ప్రతి మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలనిగణేష్ ప్రతిమలు కూర్చోబెట్టే ప్రదేశంలో షెడ్డు నిర్మాణం మంచి నాణ్యతతో ఏర్పాటు చేసుకోవాలని షార్ట్ సర్క్యూట్ కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండపాల వద్ద అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్తతో ఫైర్ ఎక్సటినుషేర్ డ్రమ్ముల్లో నీరు ఇసుకను ఏర్పాటు చేసుకోవాలని, మండపాల వద్ద భక్తి గీతాలు మాత్రమే ప్లే చేయాలని సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలన్నారు మండపాల్లో ఏదైనా అనుమానాస్పద బ్యాగులు వస్తువులు లేదా వ్యక్తులు కనిపించినట్లయితే తక్షణమే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని మండపాల వద్ద నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు ఇతర కార్యక్రమలు నిర్వహించేటప్పుడు పోలీసు వారికి ముందుగానే తెలియపరచాలని తద్వారా మండపాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ శాఖ చూసుకోవడం జరుగుతుందని గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపన రోజున నిర్దిష్ట సమయానికి విగ్రహాలను మండపానికి చేరుకునే విధంగా నిర్వాహకులు చూసుకోవాలని మధ్యాహ్నం నుండే గణేష్ నిమజ్జన శోభాయాత్ర ప్రారంభించి నిర్దేశించిన సమయానికి నిమజ్జనం పూర్తయ్యే విధంగా మండప నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని గణేష్ విగ్రహాల ప్రతిష్టాపన రోజున నిమజ్జనం రోజున నిర్వాహకులు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ ట్రాఫిక్ ఎలాంటి అంతరాయం కలిగించకుండా శోభాయాత్రను నిర్వహించుకోవాలని గణేష్ శోభాయాత్ర సమయంలో ఇతరులపై రంగులు చల్లడం చేయకూడదన్నారు శోభయాత్ర సమయంలో ఇతరులను కించపరిచే విధంగా స్లొగన్స్ చేయకూడదని శోభయాత్ర సమయంలో టపాసులు పేల్చడం పూర్తిగా నిషేధం అని సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఎలాంటి రుమర్స్ వదంతులు నమ్మకూడదని ఎలాంటి సందేహం ఉన్న సంబంధిత పోలీసు వారికి లేదా డయల్ 100 కి సమాచారం అందించాలని తెలిపారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం వుదయం బ్యూరో సెప్టెంబర్- 07:**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లో లేకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.

మధిర మండలం నిధానపురం గ్రామానికి చెందిన ఏ. నాగిరెడ్డి తమ పిల్లలకు షుగర్, కిడ్నీ వ్యాధి సమస్యలు ఉన్నాయని, దీనికి అవసరమైన మందులు సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం, కూసుమంచి మండలానికి చెందిన రైతులు తమకు ఆన్ లైన్ విధానం రద్దు చేసి ఎరువులు సరఫరా చేయాలని, భక్త రామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులు నింపాలని, మార్క్ ఫెడ్ ద్వారా పెసర పంట కొనుగోలు నిమిత్తం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, వ్యవసాయ శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి వినతులకు సత్వర పరిష్కారం చూపాలి

- ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ అంకిత్
- మండలాల్లోనూ ప్రజావాణి నిర్వహణతో ప్రజలకు చేరువగా సేవలు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి)**

ప్రజల నుంచి స్వీకరించే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం కీలక వేదికగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. భూ సంబంధిత సమస్యలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాలు, ఉపాధి, పింఛన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావివ్వరాదని స్పష్టం చేశారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి, ప్రజావాణి దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల స్థాయిలోని ఎంపీడీవోకార్యాలయాల్లోనూ ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమకు సమీపంలోని ఎంపీడీవో కార్యాలయంలో వినతులు సమర్పించి స్థానిక స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం పొందాలని సూచించారు. వినతులతో పాటు సంబంధిత ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.

**ప్రజావాణిలో వచ్చిన ప్రధాన వినతులు**

షాపు స్థలం తిరిగి ఇప్పించాలని వినతి: దుమ్ముగూడెం మండలం పర్ణశాలకు చెందిన బానోతు భవిత గత ఆరు సంవత్సరాలుగా పర్ణశాలలోని నార చీరల వద్ద కూల్‌డ్రింక్స్ షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల గోదావరి వరదల కారణంగా షాపు నీట మునిగిందని, తిరిగి షాపు ఏర్పాటు చేసుకునే సమయంలో తన స్థలంలో ఇతరులు షాపు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌కు విన్నవించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని, తన షాపు స్థలాన్ని తిరిగి ఇప్పించాలని కోరారు. దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని భద్రాచలం సబ్ కలెక్టర్‌కు ఎండార్స్ చేశారు. డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి: జూలూరుపాడు మండలం కొమ్ముగూడెం గ్రామ ప్రజలు గత ఆరు సంవత్సరాలుగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. మురుగునీరు రోడ్లపై నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ సమస్యను పరిష్కరించాలని కోరారు. దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని జూలూరుపాడు ఎంపీడీవోకు ఎండార్స్ చేశారు. అంగన్వాడీ టీచర్ పోస్టు కేటాయించాలని వినతి: మణుగూరు మండలం సమితిసింగారం గ్రామపంచాయతీకి చెందిన గుండి సౌజన్య ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా అంగన్వాడీ టీచర్ పోస్టుకు దరఖాస్తు చేసుకుని అర్హత సాధించినట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాన్ని పోషించుకుంటున్న తనకు అర్హతలను పరిశీలించి అంగన్వాడీ టీచర్ పోస్టు కేటాయించాలని కోరారు. దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు.



**అంగన్వాడీ కేంద్రం, పాఠశాల మంజూరు చేయాలని వినతి:**

బూర్గంపాడు మండలం సారపాక గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీరాంపురం ఎస్టీ కాలనీకి చెందిన 65 గిరిజన కుటుంబాలు సుమారు 35 సంవత్సరాలుగా అక్కడ నివసిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల లేకపోవడంతో పిల్లలు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. గ్రా మానికి అంగన్వాడీ కేంద్రం లేదా ప్రాథమిక పాఠశాల మంజూరు చేయాలని కోరారు. దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీఓకు ఎండార్స్ చేశారు.

**పట్టాదారు పాస్‌బుక్ జారీ చేయాలని విజ్ఞప్తి:**

ఇల్లందు మండలం సుదిమల్ల గ్రామానికి చెందిన ధనసరి పగిడిద్దరాజు సర్వే నంబర్ 617లో తనకు ఐదు ఎకరాల పట్టా భూమి ఉండగా, సింగరేణి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు కోసం రెండు ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని తెలిపారు. ప్రస్తుతం మిగిలిన మూడు ఎకరాల భూమికి సంబంధించిన పాత రికార్డులను సవరించి, తన పేరుపై నూతన పట్టాదారు పాస్‌బుక్ జారీ చేయాలని కోరారు. దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత సెక్షన్ అధికారికి ఎండార్స్ చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హామీల నెరవేర్చాలని ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం ఇచ్చిన టిఆర్ఎస్ నాయకులు

**అనంతగిరి సెప్టెంబర్ 07 వుదయం**



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరుతూ బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నల్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో అనంతగిరి ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు.గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉంటే,రేవంత్ రెడ్డి ప్రభుత్వం 6 గ్యారెంటీల పేరుతో, 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు.వంద రోజుల్లోనే అన్ని హామీలు అమలు చేస్తామని గొప్పలు చెప్పిన నాయకులు,నేడు వందల రోజులు గడిచినా ఒక్క హామీని కూడా సంపూర్ణంగా నెరవేర్చలేకపోయారని మండిపడ్డారు.ప్రస్తుతం ప్రభుత్వం 22ఏ నిషేధిత జాబితా పేరుతో పేద ప్రజల పట్టా భూములు,పరంపోకు భూములు,ఎన్నో ఏళ్లుగా అనుభవిస్తున్న భూములను చేర్చి ప్రజలను తీవ్ర మానసిక క్షోభకు గురిచేస్తోందని అన్నారు.చదువుకునే విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని,తులం బంగారం అందజేస్తామని,పింఛన్లను రెండు వేల నుంచి నాలుగు వేలకు పెంచుతామని చెప్పి ఇప్పుడు మొహం చాటేశారని,కేవలం ఉచిత బస్సు ప్రయాణం ఒక్కటే అమలు చేసి చేతులు దులుపుకుంటే సరిపోదని ఎద్దేవా చేశారు.పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు,మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ నాయకత్వ సూచనల ప్రకారం ప్రజా సమస్యలపై అధికారులకు వినతిపత్రం అందజేశామని,కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పక్షాన ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తామని,లేనిపక్షంలో ప్రజలే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో గొండ్రియాల సర్పంచ్ కలకొండ లచ్చయ్య,నాయకులు పందిరి వీరయ్య యేసు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మార్వో, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రాలు అందచేత

**వర్ధన్నపేట , సెప్టెంబర్ 7 ( వుదయం ప్రతినిధి ):**



వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు,వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు రమేష్ ఆదేశాల మేరకు సోమవారం వర్ధన్నపేట ఎమ్మార్వో,ఎంపీడీవో , మున్సిపల్ కమీషనర్ కు వర్ధన్నపేట మండల , పట్టణ అధ్యక్షులు తుళ్ళ కుమారస్వామి , గోధుమల మధుసూదన్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగిందని మండల , పట్టణ అధ్యక్షులు తుళ్ళ కుమారస్వామి , గోధుమల మధుసూదన్ లు తెలిపారు. వారు మాట్లాడుతూ...ముఖ్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారము లోకి రాక ముందు 6 గ్యారంటీలు,420 హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత 100 రోజులలో అమలు చేస్తామని చెప్పి 1000 రోజులైనా అమలు చేయకపోవడంతో వెంటనే అమలు చేసేలా ప్రభుత్వం పై వత్తిడి తెచ్చేందుకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది.ఈరోజు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి రాకుండా అడ్డుకొని అక్రమ అరెస్టు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరసిస్తూ వర్ధన్నపేట అంబేద్కర్ సెంటర్లో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తుళ్ళ కుమారస్వామి, పట్టణ అధ్యక్షులు గోధుమల మధుసూదన్,మాజీ జెడ్పిటిసి మార్గం బిక్షపతి, మాజీ మార్కెట్ చైర్మన్ గుజ్జ సంపత్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ గుజ్జ వీరన్న, తుమ్మల శ్రీధర్, సిల్వర్ కుమార స్వామి,తిరుపతి సురేష్,సింగరమైన రాజశేఖర్,భానోత్ నవీన్, దుగ్యాల మాధవరావు,అంగోత్ బిక్షపతి తోటకూరి రాజమణి,పూజారి రఘు,కొందటి దేవేందర్, వంశీ,మాజీ ప్రధాన కార్యదర్శి కొండేటి శ్రీనివాస్, పిట్టల రాజు,భూక్యా రామన్న, వసంత్ రమేష్ నాయక్,కందుగుల నర్సయ్య, భూక్యా లక్ష్మణ్,తదితరులు పాల్గొన్నారు.

## విధులకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం.. పంప్ డ్రైవర్ మృతి

**కార్మికుడి మృతికి ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ రజాక్ ప్రగాఢ సానుభూతి**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 07 (వుదయం ప్రతినిధి)**



విధులకు వెళ్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తగూడెం సివిల్ ఫిల్టర్ బెడ్‌లో పంప్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్. కోటేశ్వర్ రావు మృతి చెందారు. ఆదివారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో రుద్రంపూర్ ఫిల్టర్ బెడ్ సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కోటేశ్వర్ రావును చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఐఎన్టీయూసీ నాయకులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులతో మాట్లాడి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం తదితర ప్రక్రియలను దగ్గరుండి పర్యవేక్షించారు. కోటేశ్వర్ రావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్ మాట్లాడుతూ, నిబద్ధతతో విధులు నిర్వహించిన కార్మికుడిని కోల్పోవడం సింగరేణి కుటుంబానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. కోటేశ్వర్ రావు కుటుంబానికి కంపెనీ నుంచి అందాల్సిన అన్ని సౌకర్యాలు, హక్కులు అందేలా ఐఎన్టీయూసీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

కార్మికులు విధులకు వెళ్లే సమయంలో, తిరిగి ఇంటికి వచ్చే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రహదారి భద్రతా నియమాలను పాటిస్తూ అప్రమత్తంగా ప్రయాణించాలని రజాక్ సూచించారు. రోడ్డు భద్రతపై ప్రతి కార్మికుడు అవగాహన కలిగి ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకులు మల్లికార్జున, భాను కమల్, జల్లి కిరణ్, విజయ్, పరంజ్యోతి, మల్లారపు కొమరయ్య, సకినాల సమయ్య, రంగినేని వెంకటేశ్వర్లు, ఫిట్టర్ విజయ్, నాగేందర్, పాటల్, విజయ్ రాజు, కొమ్మరయ్య, కమల్, ఈశ్వర్ తదితరులు, అలాగే పంప్ డ్రైవర్లు, వాల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## బుల్లెట్ ట్రైన్ సాధనకు పెరిక సంఘం మద్దతు

**ఆదినారాయణ దీక్షకు సంఘీభావం ప్రకటించిన జిల్లా అధ్యక్షుడు బంధు శ్రీధర్ బాబు**

**సూర్యాపేట సెప్టెంబర్ 7, వుదయం ప్రతినిధి**



బుల్లెట్ ట్రైన్ సాధనకు సూర్యాపేట జిల్లా పెరిక కుల సంఘం (766/2014) మద్దతు ప్రకటించింది. సూర్యాపేట అంబేద్కర్ చౌరస్తాలో బుల్లెట్ ట్రైన్ సాధన కోసం ట్రాక్టర్స్, ఆటోనగర్ అసోసియేషన్ల అధ్యక్షుడు రాందేని ఆదినారాయణ ఆధ్వర్యంలో దాదాపు 20 మంది సభ్యులు చేపట్టిన నిరాహార దీక్షకు సూర్యాపేట జిల్లా పెరిక సంఘం అధ్యక్షుడు బంధు శ్రీధర్ బాబు సంఘీభావం ప్రకటించారు. దీక్షా ప్రాంతానికి వెళ్లి ఆదినారాయణకు పూలమాల వేసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. 50 రోజులుగా కొనసాగుతున్న ఈ ఉద్యమానికి అన్ని వర్గాల మద్దతుతో మరింత ఉగ్రరూపం దాల్చాలని, సూర్యాపేట జిల్లా పెరిక కుల సంఘం కూడా బుల్లెట్ ట్రైన్ సాధనకు పూర్తి మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి యర్రంశెట్టి సైదయ్య, పట్టణ కోశాధికారి సోమిశెట్టి లింగయ్య పాల్గొని దీక్షకు మద్దతు తెలిపారు.

## కేటీఆర్, హరీష్ రావుల అరెస్టుతో దద్దరిల్లిన అశ్వారావుపేట రోడ్డెక్కిన బీఆర్ఎస్ శ్రేణులు, భారీ బైక్ ర్యాలీ



**అశ్వరావుపేట, సెప్టెంబర్ 7, (వుదయం ప్రతినిధి)**

అశ్వరావుపేట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అసెంబ్లీ సమావేశాల వేళ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి సహా పలువురు ప్రముఖ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల అక్రమ అరెస్టును నిరసిస్తూ, అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల విఫల పాలనకు నిరసనగా భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్ పిలుపు మేరకు స్థానిక నాయకులు, కార్యకర్తలు ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై బైఠాయించి తీవ్ర నిరసన తెలిపారు. అంతకుముందు, పట్టణంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి సామూహికంగా ఎంపీడీవో కార్యాలయానికి తరలివెళ్లారు. అక్కడ ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన అనంతరం, మండల ప్రజావాణి / ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ క్యూలో నిలబడి 200కు పైగా విజ్ఞాపన పత్రాలను అధికారులకు సమర్పించి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకురాళ్లు కాసాని నాగ శేషా పద్మ, వగ్గెల పూజ, కౌన్సిలర్ డాక్టర్ ఉదయజ్యోతి తదితరులు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ 100 రోజుల్లో హామీలు నెరవేరుస్తామని అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిందని, 1000 రోజులు గడిచినా ఒక్క హామీ కూడా సరిగ్గా అమలు చేయలేదని మండిపడ్డారు. ప్రతిపక్షం గొంతు నొక్కేందుకు మహిళా ఎమ్మెల్యేలు అని కూడా చూడకుండా చీరలు పట్టుకుని లాగడం, మాజీ హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డిని పురుష పోలీసులతో అరెస్టు చేయించడం దారుణమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సమాజంలో మహిళలకు ఇచ్చే గౌరవానికి భంగం కలిగిస్తూ, ప్రజాస్వామ్యంలో మహిళా ప్రజాప్రతినిధుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు. హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందని, తక్షణమే ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఈ నిరసన కార్యక్రమంలో జుజ్జురపు శ్రీరామ్ మూర్తి, గుడవర్తి వెంకటేశ్వరరావు, సత్యవరపు సంపూర్ణ, ఇస్లావత్ లక్ష్మి , మోటూరి మోహన్, SK రఫీ, శెట్టిపల్లి రఘురాం, రాజనాల గంగాధర్, అఖిల్, కిరణ్, రమేష్, పాలవంచ జీవన్, నల్లపు రామారావు, కూనసోత్ నవీన్, బొల్లుకొండ చెన్నారావు, పానుగంటి లక్ష్మణ్ రావు, జుజ్జురి సత్యనారాయణ, సున్నం రామలక్ష్మయ్య, యుగంధర్, బుల్లెట్ రాజు, ప్రతాప్, వల్లెపు తిరుపతిరావు, లాజర్, కిశోర్, రాంబాబు, అమీర్, కూరపాటి నరేష్, నారం నాగ లక్ష్మి , జుజ్జురి సాయి, పానుగంటి చెన్నకేశవులు, కవులూరి నరేష్, కాటూరి నాగు, తగరం జగన్నాథంలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, యువజన, విద్యార్థి విభాగ నాయకులు, మహిళా నాయకులు మరియు భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో ఎంపీడీవో శంకర్ నాయక్ కు వినతిపత్రం అందచేత



**పర్వతగిరి , సెప్టెంబర్ 7 ( వుదయం ప్రతినిధి ):**

పర్వతగిరి మండలం ముత్య తండా చెరువు అన్యాక్రాంతం కాకుండా చెరువు చుట్టుకొలత వేసి హద్దులు నాటి నక్ష ఇవ్వాల్సిందిగా గ్రామ సర్పంచ్ భూక్య నరేష్ మరియు వార్డు సభ్యులు ప్రజావాణిలో ఎంపీడీవో శంకర్ నాయక్ ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న రేషన్ బియ్యాన్ని రావూరు గ్రామానికి వెళ్లి తీసుకోవటనికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కావున డీలరు మొత్య తండా గ్రామంలో కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఇక్కడ ప్రజలకు అందుబాటులో ఇవ్వాల్సిందిగా సర్పంచ్ భూఖ్య నరేష్ ప్రజావాణిలో ఎంపీడీవో శంకర్ నాయక్ ఫిర్యాదు చేశారు . రావూరు, మో త్య తండా , సిత్య తండా , గుగులోత్ తండా లలో వేలాడుతున్న కరెంటు వైర్లను సరిచేసి విద్యుత్తు ఇబ్బందులు లేకుండా చూడాల్సిందిగా రెండు గ్రామాల సర్పంచులు వార్డు సభ్యులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు . కార్యక్రమంలో భూక్య నరేష్, గుగులోత్ భద్రమ్మ ,లక్ష్మీనారాయణ ,గడ్డి యాకయ్య , విజయ్ ,దాసు,వార్డు సభ్యులు పాల్గొన్నారు

## మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌పై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదు

**ఐనవోలు మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు గడ్డం రఘువంశీ గౌడ్**

**ఐనవోలు , సెప్టెంబర్ 7 ( వుదయం ప్రతినిధి ):**



ఐనవోలు మండల కేంద్రం లో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆరూరి రమేష్ పై అసత్య ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులపై బీఆర్ఎస్ పార్టీ సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు గడ్డం రఘువంశీ గౌడ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మా నాయకుడు ఆరూరి రమేష్ పేరు చెప్పుకొని రాజకీయంగా ఎదిగిన వారు, ఈరోజు ఆయనపైనే ఆరోపణలు చేయడం చూస్తుంటే విడ్డూరంగా ఉంది. గతంలో మా నాయకుడి వల్ల లబ్ధి పొందింది వాస్తవం కాదా? ఆయన సహకారంతో బాగుపడిన విషయాన్ని ప్రజలు మర్చిపోలేదు. ఈరోజు ఎవరు ఏ విధంగా బతుకుతున్నారో ప్రజలందరూ గమనిస్తున్నారు" అని అన్నారు.

ప్రజాక్షేత్రంలో ప్రజలే అంతిమ తీర్పు ఇస్తారని, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన వారికి గుణపాఠం చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవని గడ్డం రఘువంశీ గౌడ్ హెచ్చరించారు.నందనం సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపెల్లి చందర్ రావు , మాజీ సర్పంచ్ పల్లకొండ సురేష్ , తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**మధిర, సెప్టెంబర్ 7, వుదయం, ప్రతినిధి:**

మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో ఎండిఓకి విజ్ఞాపన పత్రం ఇచ్చిన మధిర మండల మరియు పట్టణ టిఆర్ఎస్ నాయకులు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి 2023 అనేక హామీలు ఇచ్చిందని ఏ హామీ నిలబెట్టుకోలేదని ముఖ్యంగా మహిళలకు 2500 ఇస్తాను అని యువతులకు స్కూటీలు ఇస్తామని కొత్తగా పెళ్లయిన వారికి కల్యాణ లక్ష్మి తో పాటుగా తులం బంగారం ఇస్తామని ఆసరా పెన్షన్లు 2000 నుండి 4,000 కు పెంచుదామని వికలాంగుల పెన్షన్లు 4000 నుంచి 6 వేలకు పెంచుతామని చేతకాని హామీలు ఇచ్చిందని ఎరువుల సరఫరా చేయటం చేతకావడం లేదని రైతులకు రుణమాఫీ సరిగా చేయలేదని ఇచ్చినటువంటి ప్రతి హామీని విస్మరించారని ఆ హామీలు వెంటనే అమలు చేయాలని కోరుతూ పార్టీ తరపున విజ్ఞాపన అందజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు బిక్కీ కృష్ణ ప్రసాద్, బొగ్గుల భాస్కర్ రెడ్డి, పల్లపోతుల వెంకటేశ్వర రావు,వంకాయలపాటి నాగేశ్వరరావు, బొగ్గుల వీరారెడ్డి, రాయుడు భద్రయ్య చీదిరాల రాంబాబు వేల్పుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## నూతన గృహ శంకుస్థాపన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు

**మధిర, సెప్టెంబర్ 7, వుదయం, ప్రతినిధి:**

మధిర పట్టణంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కోన ధని కుమార్ నూతన గృహ శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు పాల్గొని కోన ధని కుమార్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన గృహ నిర్మాణం సంతోషంగా, శుభప్రదంగా కుటుంబ సభ్యులకు సుఖసంతోషాలు,ఆయురారోగ్యాలు కలగాలని వారు ఆకాంక్షించారు.



## డీజేల యజమానుల బైండ్ ఓవర్

**తొర్రూరు సెప్టెంబర్ 7 (వుదయం ప్రతినిధి):**

రానున్న గణేష్ విగ్రహాల ఆగమనం, నిమజ్జనం కార్యక్రమాల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు తొర్రూరు పోలీసులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా డీజే నిర్వాహకులు,సంబంధిత వ్యక్తులను ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట బైండ్ ఓవర్ చేయించారు. ఎవరు కూడ నిబంధనలు అతిక్రమించ కూడదు అని, గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని పోలీసులు సూచించారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు: భూతరాజు శ్రీహరి

**చండూరు, సెప్టెంబర్ 7(వుదయం):**



అక్రమ అరెస్టులతో బిజెపి చేపడుతున్న ఉద్యమాలను అడ్డుకోలేరని బిజెపి చండూరు మున్సిపల్ అధ్యక్షుడు భూతరాజు శ్రీహరి స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన 'చలో అసెంబ్లీ' పిలుపులో భాగంగా చండూరు బిజెపి నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.ఈ సందర్భంగా భూతరాజు శ్రీహరి మాట్లాడుతూ... బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేవరకు బిజెపి విద్యార్థుల పక్షాన పోరాడుతుందని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి, పేద, బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో చదువు పూర్తయినా సర్టిఫికెట్లు ఇవ్వక యాజమాన్యాలు విద్యార్థులను వేధిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తే విద్యార్థులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. వెంటనే బకాయిలు చెల్లించకపోతే ఎమ్మెల్యేలను, మంత్రులను ప్రజల్లో తిరగనివ్వమని, వారి ఇళ్లను ముట్టడిస్తామని తెగేసి చెప్పారు. అరెస్ట్ అయిన వారిలో బీజేవైఎం రాష్ట్ర నాయకుడు పేర్ల గణేష్, బీజేవైఎం మాజీ మండల అధ్యక్షుడు పెసర్ల హరీష్ తదితరులు ఉన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**మండల అభివృద్ధి అధికారి అద్వైత చేతుల మీదుగా ఈ నెల 10 ధర్నా పోస్టర్ ఆవిష్కరణ**

**ఖానాపురం, సెప్టెంబర్ 7 (వుదయం ప్రతినిది):**

ఉద్యోగుల ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు ఉద్యోగుల ఉపాధ్యాయుల నాయకులు రామ్మోహన్ రావు, రాజశేఖర్, సంతోష్, నర్సింహులు తెలిపారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలోని ఈ నెల 10న చలో హైదరాబాదులో నిర్వహించే ధర్నా పోస్టర్ను మండల అభివృద్ధి అధికారి వనపర్తి అద్వైత చేతుల మీదుగా ఆవిష్కరించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగుల ఉపాధ్యాయుల నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలుపుతూ, ఈనెల 10న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాని ఉద్యోగులు ఉపాధ్యాయులు భారీగా తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని వారు ఉద్యోగులకు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉద్యోగులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పేరుకే ప్రజావాణి సమస్యల పరిష్కారంలో అధికారుల విఫలం



- ప్రజావాణిలో సంతకాలు పెట్టి వెళ్ళిపోతున్న అధికారులు
- మద్దాల ప్రభాకరరావు, సీపీఎం మండల కార్యదర్శి

**మధిర, సెప్టెంబర్ 7,వుదయం ప్రతినిధి,**

ఎర్రుపాలెం మండలం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చినట్లు పార్టీ మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ తెలియజేశారు. ఈ సందర్భంగా మద్దాల ప్రభాకరరావు మాట్లాడుతూ మండలంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండట్లేదని భూ సమస్యలు సంక్షేమ పథకాలు ఇతర అర్జీలు పెట్టుకున్న వాటిపై రోజువారి పని అధికారులు చేయట్లేదని ఒక అధికారిపై ఇంకొక అధికారి చెప్పుకోవటమే సరిపోతుందని విమర్శించారు.మరోవైపు,ప్రజావాణి ద్వారా వచ్చే సమస్యలను ట్రాక్ చేయడానికి ప్రజావాణి వెబ్ పోర్టల్ అందుబాటులో ఉన్నా, ఫిర్యాదుదారులకు రసీదు ఇవ్వకుండా సమస్య ఎప్పటికీ తీరుతుందో ఏ అధికారిని కలవాలో స్పష్టత లేక దరఖాస్తుదారులు నిరాశ చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజావాణిలో ఉన్నత అధికారులు అన్ని శాఖల సంబంధించిన అధికారులు ఉండాలని రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు,మచ్చుశాక, విద్యా, ఆరోగ్యా,మైనింగ్ భూ సమస్యల వంటి కీలక దరఖాస్తులపై త్వరితగతిన నిర్ణయాలు తీసుకోకపోతే ఈ కార్యక్రమం కేవలం పేరుకే మిగిలిపోతుందాని అసంతృప్తి ప్రజల్లో వ్యక్తమవుతుందని ప్రజా సమస్యల దరఖాస్తులకు పరిష్కార మార్గంగా జవాబుదారీగా అధికారులు, ప్రభుత్వం ఉండాలని డిమాండ్ చేశారు. ఈరోజు వచ్చిన అర్జీలలో మండలంలో విపరీత అక్రమ మైనింగ్ జరుగుతుందని అక్రమార్కులు అధిక వేగంతో అధిక లోడులతో నిబంధన ఉల్లంఘిస్తూ ప్రజలు మూగజీవులు ప్రాణాలు తీస్తున్నారని అక్రమ మైనింగ్ ఆగడాల పై అధికారుల చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కొత్త గోపవరం గ్రామ శ్రీ వెంకటేశ్వర డ్వాక్రా గ్రూపులో జరుగుతున్న అవకతవకలపై అధికారులు చర్యలు తీసుకోవాలని మీనవోలు గ్రామంలో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని పెద్ద గోపవరం రేమిడిచర్ల మండలంలో ఉన్న వివిధ భూ సమస్యలు పరిష్కారం చేయాలని,అక్రమ మైనింగ్ నిలుపుదల వెంటనే చేయాలని లేని పక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మరో పోరాటానికి సిద్ధమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గొబ్బూరి కృష్ణంరాజు షేక్ గాలి సాహెబ్, ధర్మయ్య, చిరంజీవి,ఉన్నం శ్రీనివాసరావు, నక్కా పుల్లారావు, కృష్ణ, మురళి,షేక్ బేబీ, తదితరులు పాల్గొన్నారు.